



- జీతం రూ.13200.. కటింగ్ రూ.9400
- హెల్త్ మిషన్ ఉద్యోగుల జీతాల్లో కోతలే కోతలు
- గగ్గోలు పెడుతున్న వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు
- నవంబరు నుంచి మిగిలిన సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ లింకు

సోలార్ కార్యాలయాల్లో.. కాంతులు

సోలార్ పవర్.. సూర్యుడి వెలుగులను వృథా కానీయకుండా కరెంట్ ఉత్పత్తి. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వినియోగదారులపై బిల్లుల భారం తగ్గుతుంది. ఈ క్రమంలో సోలార్ పవర్ ద్వారా కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రభుత్వం కూడా సిద్ధమైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు కూడా సోలార్ పవర్‌ను సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందుకు సంబంధించి ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యతను ఎన్‌టీపీసీకి అప్పగించింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 260 ప్రభుత్వ కార్యాలయాల్లో ఇక నుంచి సోలార్ కాంతులు ప్రసరించనున్నాయి. తద్వారా ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 కోట్ల వరకు విద్యుత్ బిల్లుల భారం తగ్గనున్నది.



- నెడ్‌క్యాప్ ఆధ్వర్యంలో సోలరైజేషన్
- నిర్వహణకు ఎన్‌టీపీసీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం
- ఏడాదికి లక్ష యూనిట్లు వచ్చే కార్యాలయాలకు ప్రాధాన్యం
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 కార్యాలయాల్లో ప్యానల్స్ ఏర్పాటు
- ఏడాదికి సుమారు రూ.50 కోట్లకుపైగా తగ్గనున్న విద్యుత్ బిల్లుల భారం
- సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందంటున్న అధికారులు

- ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి గతంలో నెలకు రూ.30 లక్షల వరకు కరెంటు బిల్లు వచ్చేది. ఇప్పుడు అది రూ.3 లక్షలకు పరిమితమైంది. కారణం ఏమిటంటే అక్కడ 2 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్స్ అమర్చారు.
- గుంటూరు నగరానికి తాగునీటిని అందించే సంగం జాగర్లమూడి పంపు హౌస్ వద్ద 500 కిలో వాట్ సామర్థ్యం కలిగిన ఫ్లోటింగ్ సోలార్ అమర్చారు. అప్పటి నుంచి విద్యుత్ బిల్లు తగింది.
- గుంటూరు కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రి తదితర ప్రధాన కార్యాలయాలకు గతంలో రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. ఆయా కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

- (గుంటూరు సిటీ - ఆంధ్రజ్యోతి)

పలు ప్రభుత్వ కార్యాలయాలకు నెలనెలా రూ.వేలల్లో కరెంటు బిల్లులు వచ్చేవి. వాటిని కట్టడం ఆయా కార్యాలయాలకు గగనంగా మారుతుంది. ఇప్పటికీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ట్రాన్స్‌కోకు ఉన్న పెండింగ్ బిల్లుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల వాటానే అధికం. కొన్ని సందర్భాల్లో కరెంటు బిల్లులు కట్టలేదని ట్రాన్స్‌కో అధికారులు ఆయా కార్యాలయాలకు విద్యుత్ ఫీజులు తీసిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం విద్యుత్ బిల్లుల భారం తగ్గించడంపై దృష్టి సారించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు ఆంధ్రప్రదేశ్ నూతన మరియు పునరుద్ధరణ ఇందన వనరుల అభివృద్ధి సంస్థ(నెడ్ క్యాప్) ఆధ్వర్యంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి సొమ్మును ఆదా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రభుత్వ భవనాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే కొన్ని కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వినియోగిస్తుంది. ఆయా కార్యాలయాలకు గణనీయంగా విద్యుత్ బిల్లులు తగ్గిపోయాయి.

ఎన్‌టీపీసీదే మొత్తం బాధ్యత

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముక్త బిజిలీ యోజన కింద ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్‌కు శ్రీకారం చుడుతున్నది. ఈ క్రమంలో ఈ బాధ్యతను ప్రభుత్వం ఎన్‌టీపీసీకి అప్పగించింది. రెస్కో సిస్టంలో ఎన్‌టీపీసీ ఈ బాధ్యతను నిర్వర్తిస్తుంది. ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వినియోగించే ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి వాటి నిర్వహణ బాధ్యత 25 ఏళ్ల వరకు ఎన్‌టీపీసీ చూసుకుంటుంది. ప్యానల్స్ ఏర్పాటు మొత్తం ఖర్చును ఎన్‌టీపీసీ భరిస్తుంది. అందుకు ప్రతిగా ప్రభుత్వ శాఖల నుంచి అతితక్కువ విద్యుత్ చార్జీలను వసూలు చేస్తుంది. ఉదాహరణకు ప్రస్తుతం యూనిట్ చార్జి రూ.4 వరకు ఉంటే, సోలరైజేషన్ తర్వాత ఎన్‌టీపీసీ యూనిట్ చార్జి రూ.2 మాత్రమే తీసుకునేలా ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. సోలరైజేషన్‌కు మొదట ఏడాదికి లక్ష యూనిట్లు విద్యుత్ వాడుతున్న ప్రభుత్వ కార్యాలయాలను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 260 ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నట్లు నెడ్ క్యాప్ తేల్చింది. గుంటూరు సమీపంలోనే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకం ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఒక్కొక్క కార్యాలయం, స్థానిక సంస్థలకు నెలనెలా లక్షల్లో కరెంట్ బిల్లు వస్తుంది. సోలరైజేషన్ జరిగితే ఆ భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రస్తుతం గుంటూరుకు తాగునీరు అందించే సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్(నీటిపై) ప్యానల్స్ ఏర్పాటు చేశారు. దానివల్ల ఆ పరిసర ప్రాంతాల్లో కాలుష్యం బాగా తగ్గినట్లు తేలింది. సోలార్ పని తీరును తెలియజేసే యాప్‌లో 2023 డిసెంబరులో సంగంజాగర్లమూడి పంపు హౌస్‌కు ఫ్లోటింగ్ సోలార్ ఏర్పాటు చేయడం వల్ల ఇప్పటి వరకు 169.8 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉత్పత్తి తగ్గిందని, 169.8 టన్నుల బొగ్గు ఆదా అయినట్లు నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ కార్యాలయాల సోలరైజేషన్ వల్ల వాయు కాలుష్యం పూర్తిగా తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. బొగ్గు నిల్వలు పెరుగుతాయని, ప్రభుత్వంపై విద్యుత్ భారం తగ్గుతుందంటున్నారు.

అద్భుతమైన పరిష్కారం



విద్యుత్ సమస్యను అధిగమించేందుకు సోలార్ విద్యుత్ అద్భుతమైన పరిష్కారం. సోలరైజేషన్ వల్ల ప్రభుత్వ సొమ్ము చాలా వరకు ఆదా అవుతుంది. గృహాలకు కూడా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. ప్రభుత్వం గరిష్ఠంగా రూ.78వేల వరకు ఒక్కొక్కరికి సబ్సిడీ ఇస్తుంది.

- ఉడుముల బ్రహ్మారెడ్డి, పీడీ, నెడ్ క్యాప్



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన సోలార్ సిస్టం

హాజరు లింకు.. జీతం కోత

గుంటూరు సిటీ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆ ఉద్యోగులకు పని కాదు.. హాజరు ముఖ్యం అంట. హాజరు ఆధారంగానే వారికి జీతం ఇస్తారంట. ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిజేషన్ సిస్టం) పేరుతో ఉద్యోగులకు భారీగా జీతాల్లో కోత పడుతుంది. దీంతో ఆయా ఉద్యోగులు గగ్గోలు పెడుతున్నా అధికారులు ఆలకించడంలేదు. నేషనల్ హెల్త్ మిషన్‌లో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు అక్టోబరు నెల జీతంలో భారీగా కోత పడింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటిజెంట్ వర్కర్‌గా పనిచేసే ప్రత్తిపాటి పద్మ జీతం రూ.13200 కాగా ఎఫ్ఆర్ఎస్ పేరుతో అక్టోబరు జీతంలో రూ.9400 కోత విధించారు. గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 70 మంది రెండో ఏఎన్ఎంలకు నెలకు రూ.23 వేలు జీతం కాగా వారిలో ఎక్కువ మందికి రూ.6 వేలు చొప్పున కోత విధించారు. ఇక డాక్టర్లు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు జీతాల్లో కూడా కోత పడినట్లు సమాచారం. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు కొంతమంది ప్రతి రోజు ముఖ ఆధారిత హాజరు వేసినా అది డేటా బేస్‌కు వెళ్లక పోవడంతో గైర్హాజరుగా చూపిస్తున్నట్లు చెబుతున్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అన్ని స్థాయిల్లోని ఉద్యోగులకు ఇక మీదట ఎఫ్ఆర్ఎస్ ఆధారంగానే జీతాలు చెల్లింపు జరుగుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఎఫ్ఆర్ఎస్‌కు సంబంధించి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. నవంబరు నుంచే ఎఫ్ఆర్ఎస్ ఆధారంగా జీతాల చెల్లింపులు జరుగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అక్టోబర్ నెలలో ఇదే ఉత్తర్వులను నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు అమలు పరిచారు. ఇప్పుడు వైద్య, ఆరోగ్య శాఖలో మిగిలిన ఉద్యోగులకు దాన్ని విస్తరించారు.

వైసీపీ హయాంలో అమలు..


గత ప్రభుత్వం వైద్యఆరోగ్య శాఖలో ఎఫ్ఆర్ఎస్ హాజరు విధానం ప్రవేశ పెట్టింది. అంతకు ముందు ఎన్నడూ లేని విధంగా ఉద్యోగి రోజుకు మూడు సార్లు హాజరు వేయాలన్న నిబంధనను గత వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఎఫ్ఆర్ఎస్ విధానంలో వైద్య శాఖ లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది నిర్దేశించిన సమయంలో, నియమించిన ప్రదేశంలో ఉండి ముఖం చూపిస్తూ హాజరు వేయాలి. ఉదయం 9 గంటలకు ఇన్ పంచ్, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 మధ్య మిడ్ పంచ్, సాయంత్రం 4 గంటల ఔట్ పంచ్ వేయాలి. ఉదయం 9 నుంచి 9.10 నిమిషాల వరకు ఇన్ పంచ్ పడుతుంది. సమయం దాటితే హాజరు నమోదుకి సంబంధిత డ్రాయింగ్ అధికారి అనుమతి(అప్రూవల్) ఇవ్వాలి. వాస్తవానికి క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ విధమైన హాజరు విధానం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు ప్రస్తుత ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. సమయంతో పని లేకుండా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించే క్షేత్రస్థాయి సిబ్బందిని ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయించాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై నిర్ణయం వస్తుందని ఎదురు చూస్తున్న తరుణంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు ఎఫ్ఆర్ఎస్‌ను ఏకంగా జీతాలకు లింకు చేయడంతో ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.



సమయంతో ముడిపెట్టలేని ఉద్యోగం

వైద్య, ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బంది సమయంతో పనిలేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఉదాహరణకు ఓ గర్భిణీ నొప్పులు పడుతుంటే అది అర్ధరాత్రి అయినా సరే ఏఎన్ఎం, ఆశా కార్యకర్త బాధితురాలితో కలిసి ఆస్పత్రికి వెళ్లాల్సిందే. గ్రామంలో వాంతులు, విరేచనాలు వంటి ఎపిడిమిక్ ప్రబలినప్పుడు రాత్రి వేళ కూడా విధుల్లో ఉండాలి. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్యూటీ సమయం అని అనడానికి లేదు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సిన సిబ్బందిని కూడా ఎఫ్ఆర్ఎస్ చట్రంలో బిగించి జీతాలు కోత అనడం వైద్య ఆరోగ్యశాఖలో నిరసనకు కారణం అవుతుంది.

అనాలోచిత నిర్ణయం అమలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు వెనక్కి తీసుకుంటారని ఆశించాం. అయితే ప్రభుత్వ పెద్దలకు తెలుసో లేదో తెలియదు కానీ ఆరోగ్య శాఖలోని క్షేత్రస్థాయి సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ అమలు నిర్ణయం ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం తెప్పిస్తుంది. ఆరోగ్య శాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు అంటే జరగదు. సాయంత్రం 4 తర్వాత విధులు ఉండవు అంటే ఎఫ్ఆర్ఎస్ జీతాలకు లింక్ చేయండి. అధికారులు ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

- మరిసేని భానుమూర్తి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలుగునాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం

వామ్మో.. ఇన్ని అభ్యంతరాలా?

◆ 69 గ్రామాల పరిధిలో 4,035 అర్జీలు ◆ ఈ నెల 5తో ముగియనున్న గ్రామసభలు ◆ రీసర్వే జరిగిన గ్రామాల్లో వెల్లువలా దరఖాస్తులు

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎవ రైనా, ఎక్కడైనా సమస్యను పరిష్కరించే దిశగా అడుగులేస్తే అయితే సానుకూల ఫలితం వస్తుంది లేదా ఆ చిక్కుముడి అలానే ఉంటుంది. కానీ గత వైసీపీ ప్రభుత్వం జగనన్న భూరక్ష పేరిట చేపట్టిన భూముల రీసర్వే రైతులకు మేలు చేయకపోగా మరిన్ని కొత్తసమస్యలను తెచ్చిపెట్టింది. ఇవి కూడా ఏవో ఒకట్రెండు గ్రామాల్లోనే ఈ సమస్య అనుకుంటే పొరపాటే. రీసర్వే పూర్తయిన 71 గ్రామాల్లోనూ ఇదే తంతు. రీసర్వే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం ఆయా గ్రామాల్లో గ్రామ సభలకు శ్రీకారం చుట్టిన శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. శనివారం నాటికి మొత్తం 69 గ్రామాల పరిధిలో సభలను రెవెన్యూ యంత్రాంగం ముగించింది. వీటి పరిధిలో ఏకంగా 4,035 అర్జీలు రావడంతో తలలు పట్టుకోవడం అధికారుల వంతైంది. ఇంకా రెండు గ్రామాల్లోనే సభలు నిర్వహించాల్సి ఉండగా ఈ నెల 5న

సంగతి తెలిసిందే. శనివారం నాటికి 69 గ్రామాల్లో సభలు పూర్తి కాగా వీటి పరిధిలో ఏకంగా 4,035 అర్జీలు రావడంతో అధికారులు విస్తుపోతున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే రీసర్వే పేరిట పెద్ద ప్రహసనాన్ని గత ప్రభుత్వం నడిపించిందే తప్ప క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధిగా పనిచేసిన దాఖలాలు లేవని స్పష్టమవుతోంది. ఈ మొత్తం దరఖాస్తు లను నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టి సంతృప్తికరంగా అర్జీలను ముగించాలంటే కనీసం రెండు నెలల సమయం కావాలన్నది రెవెన్యూ వర్గాల వాదన. త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి అభ్యంతరాలపై ఓ నిర్ణయానికి వచ్చే దిశగా అధికారులు కసరత్తు చేయనున్నారు వైసీపీ హయాంలో జిల్లాలో 71 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు అప్పట్లో ప్రకటించారు. ఈ గ్రామాల పరిధిలో గ్రామ సభలకు అక్టోబరు 22 నుంచి కూటమి ప్రభుత్వం అక్కడ గ్రామ సభలు నిర్వహణతో ఈ అంకం పూర్తవుతుందని సర్వే విభాగం చెబుతోంది.

ఇప్పటికే శిక్షణ పూర్తి..

రీసర్వేలో వచ్చిన అభ్యంతరాల పరిష్కారం సహేతుకంగా జరగాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. అందుకు ఇప్పటికే జిల్లా అధికారులకు దీనిపై రాష్ట్రస్థాయిలో శిక్షణ నిర్వహించారు. ఈ గ్రామసభల నిర్వహణ పూర్తి కాగానే జిల్లాలోని కింది స్థాయి యంత్రాంగానికి అధికారులు రీసర్వే అభ్యంతరాల పరిష్కారంపై శిక్షణ ఇవ్వనున్నారు. దానిలో భాగంగా ఈ నెల 6 నుంచి ఈ శిక్షణ కార్యక్రమాలు మొదలు కానున్నాయి. మళ్లీ సమస్య అనేది తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అర్జీదారుల సమక్షంలోనే విచారణ పూర్తి చేసి అందరి అంగీకారంతో ఓ నిర్ణయానికి వచ్చి సమస్యకు పరిష్కారం చూపెట్టే దిశగా అడుగులు వేయనున్నారు.



బల్లికురవలో నిర్వహించిన గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

గుంతల రహితంగా రహదారులు

319 కిలోమీటర్ల మేర తాత్కాలిక మరమ్మతులు

అప్పికట్ల-ఈతేరు రోడ్డు పనులను ప్రారంభించిన కలెక్టర్

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మిషన్‌పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో రహదారులు గుంతల రహితంగా మారుతాయని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మిషన్‌పాట్ హోల్‌ఫ్రీ ఏపీ కార్యక్రమంలో భాగంగా బాపట్ల మండలం అప్పికట్ల -ఈతేరు రోడ్డుపై గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 319 కిలోమీటర్ల మేర రహదార్లకు గుంతలు పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ప్రభుత్వం గుంతల రహిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మరమ్మత్తుల కొరకు జిల్లాకు రూ.16 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో రాష్ట్రీయ, ఆర్అండ్‌బీ, గ్రామాల్లోని రహదార్లకు మరమ్మతులు చేస్తామన్నారు. రూ.3.24 కోట్లతో బాపట్ల నియోజకవర్గంలోని రహదార్ల మరమ్మతులు చేస్తామన్నారు. గుంటూరు-చీరాల రహదారిలో ఈతేరు నుంచి అప్పికట్ల మీదగా నల్లమడ డ్రెయిన్ వరకు 9 కిలోమీటర్ల పొడవున గుంతలు పూడ్చేందుకు రూ.23 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పి.గ్లోరియా, ఆర్అండ్ ఈఈ గీతారాణి, డి.అరుణ, తహసీల్దార్ షేక్.సలీమా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఇనగంటి గాంధీ, ఫరీద్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



అప్పికట్ల-ఈతేరు ప్రధాన రహదారిపై చేస్తున్న మరమ్మతులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

పేదలకు జీవనోపాధి కల్పించాలి

ఉపాధిహామీ పథకం ద్వారా అర్హులైన ప్రతి పేదవాడికి జీవనోపాధి కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం ఈ నెల 5న జరగనున్న నేపథ్యంలో శనివారం ముందస్తుగా జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అనుసందానంతో జిల్లాలోని తీరప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటి ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. 3,064 గృహాలను డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలనే లక్ష్యంగా పనులు చేయాలన్నా రు. 19,790 ఎన్టీఆర్ గృహాల లబ్ధిదారులకు నిలిచిన నిధులు ఇవ్వడానికి సర్వేప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు.

డీఈవో, చీరాల కమిషనర్‌లకు చార్జిమెమో

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లకు తాగునీటిని పుష్కలంగా సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. సమావేశానికి డీఈవో, చీరాల మున్సిపల్ కమిషనర్ గైర్హాజరయ్యారు. దీంతో వారికి చార్జిమెమో ఇవ్వాలని సంబంధితాధికారులను ఆదేశించారు.



స్కూల్ వ్యాన్ తగిలి బాలుడు మృతి
6

దూర విద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

గర్భిణీకి రెండుసార్లు ఆపరేషన్ చేసిన డాక్టర్

● పరిస్థితి విషమించడంతో తల్లిదండ్రుల ఆవేదన


గురజాల ప్రభుత్వ వైద్యశాలలో శిశువుతో ఏసురాణి

గురజాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గురజాల ప్రభుత్వ వైద్యశాలలో ఈనెల 15వ తేదీన నిండు గర్భిణీకి డాక్టర్ ఆపరేషన్ చేయగా మగ శిశువు జన్మించింది. కాగా ఈ గర్భిణీకే మరోసారి కూడా ఆపరేషన్ చేయడంతో పరిస్థితి విషమంగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటన గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గురజాల మండలం చర్లగుడిపాడుకు చెందిన పేరుపోగు సలామన్, ఇస్తేరి దంపతుల కుమార్తె నిండు గర్భిణీ అయిన ఏసురాణి ఈనెల 15వ తేదీన గురజాల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం నిమిత్తం చేరింది. ఈమెకు డాక్టర్ హసీనా ఆపరేషన్ చేశారు. అయితే వారం రోజుల తరువాత కుట్లు వేసిన చోట చీము, రక్తం వస్తుండడంతో డాక్టర్ హసీనా సెలవులో ఉండగా డ్యూటీలో ఉన్న మరో డాక్టర్ ఆమెకు చికిత్స నందించి డాక్టర్ హసీనాకు ఫోన్ చేసి తెలిపారు. డాక్టర్ హసీనా హాస్పిటల్‌కు వచ్చి గర్భిణీని పరీక్షించారు. అనంతరం ఈనెల 29వ తేదీన ఆసుపత్రిలో ఏసురాణి తల్లిదండ్రులకు తెలియకుండా డాక్టర్ హసీనా కుట్లు మొత్తం తీసి ఆపరేషన్ చేశారు. మూడు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని చెప్పి మళ్లీ డాక్టర్ హసీనా సెలవుపై వెళ్లారు. అయితే శనివారం ఏసురాణికి కుట్లు వేసిన చోట మళ్లీ చీము, రక్తం కారుతుండడంతో గుంటూరు తీసుకొని వెళ్లాలని వైద్యులు ఆమె తల్లిదండ్రులకు సూచించారు. దీంతో ఏసురాణి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఆసుపత్రికి చేరుకొని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సుధీర్‌ను నిలదీశారు. ఏసురాణికి ఏదైనా జరిగితే మీదే బాధ్యత అంటూ మండిపడ్డారు. ఆసుపత్రికి వచ్చిన మొదలు టెస్టులన్నీ బయట చేయించుకోమన్నారంటూ ఆరోపించారు. అనంతరం ఏసురాణిని పిడుగురాళ్ల పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ఏసురాణికి చికిత్సను అందిస్తున్నారు.

విజయవంతమైన వివా విద్యార్థుల ఆవిష్కరణలు



వివా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జర్మనీ విద్యార్థిని

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలోచన, పరిజ్ఞానాన్ని పంచుకుంటూ సృజనాత్మకతకు సాంకేతిక మేళవింపుతో వివా విద్యార్థులు జర్మనీ విద్యార్థులతో కలసి రూపొందించిన నూతన ఆవిష్కరణలను వివా పాఠశాల వేదికగా విజయవంతంగా శనివారం ప్రదర్శించారు. మేక్థాన్-2024లో భాగంగా జర్మనీకు చెందిన ఓం విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బెర్నార్డ్ ఆధ్వర్యంలో వివా పాఠశాలకు చెందిన 13 మంది విద్యార్థులు, జర్మనీ న్యూరెంబర్గ్ నగరానికి చెందిన డ్యూరర్, మార్టిన్ బెహం పాఠశాలలకు చెందిన 13 మంది విద్యార్థులు మూడు బృందాలుగా ఏర్పడి రూపొందించిన మూడు అవిష్కరణలు బ్లైండ్ స్టిక్ (కళ్లులేని వారిని రహదారులపై అప్రమత్తం చేసే చేతికర్ర), ఎకో మోషన్ మూస్, (పల్స్ పెడల్)నాడీ వేగాన్ని అదుపులో ఉంచే సైకిల్ పెడల్‌లను ముఖ్యఅతిథి మాజీ డీజీపీ మాలకొండయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త లావు నాగేశ్వరరావు, వివా ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమక్షంలో ప్రదర్శించారు. మూడు దశలలో జరిగిన ఈ కార్యక్రమంలో మొదటి దశ అంతర్జాలం ద్వారా నిర్వహించగా విద్యార్థులు వారి ఆలోచనలను పంచుకొని మూడు ఆవిష్కరణలను ఎంచుకున్నారు. రెండో దశలో వివా విద్యార్థులు జర్మనీలో నిర్వహించిన మేక్థాన్‌లో పాల్గొని ఆవిష్కరణల రూపకల్పనకు శ్రీకారం చుట్టారు. మూడో దశలో భాగంగా జర్మన్ విద్యార్థులు వివా పాఠశాలలో విజయవంతంగా ఆవిష్కరణలను రూపొందించారు. ముఖ్యఅతిథి మాలకొండయ్య మాట్లాడుతూ ప్రాజెక్ట్ ఆధారిత విద్య అనేది విద్యార్థులకు అవసరం అన్నారు. లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధికి ఇటువంటి మేక్థాన్లు ఉపయోగపడుతాయని తెలిపారు. ప్రొఫెసర్ బెర్నార్డ్ మాట్లడుతూ ఒకే ప్రాంగణంలో కళాశాల, పాఠశాల ఉండటం ద్వారా ఈ మేక్థాన్ నందు సాంకేతిక అంశాలలో పరిష్కారాలను సులువుగా సాధించగలిగామని తెలిపారు. వైస్ ఛైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, డైరెక్టర్ ఎల్ కమాండర్ కె.ఎస్ రావు, ఉపాధ్యయులు ఎ.కె.మాధవి, వైప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షా కేంద్రాల తనిఖీ

పెదకాకాని, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ (యూజీ) 3వ సెమిస్టర్ రెగ్యులర్ అండ్ సప్లమెంటరీ పరీక్షల కేంద్రాలను డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎస్.వి.కృష్ణారావు శనివారం తనిఖీ చేశారు. మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్, వీజేపీ కళాశాలలను సందర్శించారు. పరీక్షల కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కళాశాలల యాజమాన్యాలను ఆదేశించారు.

పింఛన్ డబ్బుతో పరారైన ఉద్యోగి సస్పెన్షన్

గురజాల టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల డబ్బు రూ. 2.30 లక్షలతో పరారైన మండలంలోని తేలుకుట్ల గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ బత్తుల వెంకటనారాయణ సస్పెండ్‌కు గురైనట్లు ఎంపీడీవో గౌసియా బేగం శనివారం తెలిపారు. వెంకటనారాయణను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు.

పింఛన్ సొమ్ముతో ఉద్యోగి పరార్

ఈపూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ముతో వెల్ఫేర్ అసిస్టెంట్ పరారైన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ బాణావత్తు గోవర్ధన నాయక్ రూ. 1.76 లక్షలు పింఛన్ సొమ్ముతో కన్పించకుండా పోయాడని సెక్రటరీ శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌కు 73 పింఛన్ల పంపిణీకి డబ్బులు ఇచ్చినట్లు తెలిపారు. 1వ తేదీన 34 మందికి పంపిణీ చేసిన గోవర్ధన్ నాయక్ 39 పింఛన్‌లకు సంబంధించి రూ.1.76 లక్షలు సొమ్ముతో పరారైనాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో పంచాయతీ కార్యదర్శి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయితే గోవర్ధన్ నాయక్ భార్య పింఛన్ తాలూకా సొమ్మును ఫోన్‌పే చేశారని, పింఛన్ పంపిణీ చేసినట్లు సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గురజాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురజాల పట్టణంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాత అంబాపురంకు చెందిన లోకసాని నాగిరెడ్డి (38) బ్యాంకు పనిపై ద్విచక్ర వాహనంపై గురజాలకు వస్తుండగా పట్టణ శివారులోని హైవే వద్దకు రాగానే వెనుక నుంచి టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిపోయింది. ఈ సంఘటనలో నాగిరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య


భరత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

మాచర్లటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం అలుగురాజుపల్లిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ సీఎస్ఈ మొదటి సంవత్సరం చదువుతున్న వన్నర్లి భరత్‌కుమార్ (20) అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం జిల్లా, చెట్టూరు మండలం, చింతర్లపల్లి గ్రామానికి చెందిన వన్నర్లి నాగరాజు కుమారుడైన భరత్‌కుమార్ శనివారం కళాశాలకు వెళ్లి మధ్యాహ్నం తరువాత ఒక్కడే పట్టణంలోని విష్ణుప్రియ లాడ్జి వెనుక ఉన్న స్టూడెంట్స్ రూమ్‌కు చేరుకున్నాడు. రూమ్‌లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌కు ఉన్న హుక్‌కు ఫ్లెక్సీ బ్యానర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో స్నేహితులు వచ్చి చూసేసరికి భరత్‌కుమార్ ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా ప్రదేశానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సమాచారాన్ని కుటుంబసభ్యులకు అందించారు. భరత్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఈ ఏడాది మూడు ఆత్మహత్యలు..

కాగా ఈ ఏడాది ఇదే కళాశాలకు చెందిన మరో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. జూలై 20వ తేదీన బీటెక్ ఫైనల్ ఇయర్ చదవుతున్న దొడ్డి పవన్ కల్యాణ్ (24) పట్టణంలో తన రూంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా, ఆగస్టు 5న బీటెక్ సెకండ్ ఇయర్ చదవుతున్న జక్కిరేణుక యల్లమ్మ (21) కళాశాల హాస్టల్ గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం కష్టపడి చదివిస్తుంటే కారణం ఏదైనప్పటికీ ఉరివేసుకొని అర్థాంతరంగా ప్రాణాలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలపై అరెస్టు


కృష్ణవేణి (ఫైల్ ఫొటో)

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావుపై, ఆయన అనుచరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో తాడేపల్లిలోని వైసీపీకి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు పాలేటి కృష్ణవేణి (33) శనివారం అరెస్టు అయ్యారు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సీఐ పి.రమేష్ ఆధ్వర్యంలో తాడేపల్లికి వెళ్లి ఆమెను అరెస్టు చేసి చిలకలూరిపేట కోర్టులో శనివారం సాయంత్రం హాజరు పరిచారు. విచారణ అనంతరం కృష్ణవేణికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. కృష్ణవేణిపై స్థానిక తెలుగుదేశం పార్టీకి చెందిన కందుల వెంకటరమణ ఇటీవల ఫిర్యాదు చేశారు. టీడీపీ వారిని కించపరిచే విధంగా ఆమె సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టినట్టుగా సమాచారం. ఆమె పుల్లారావు పేరును కూడా వాడి ఆయన్ను కూడా కించపరిచే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కృష్ణవేణిని అరెస్టు చేశారు.

దూర విద్య పరీక్షల్లో మాస్ కాపీయింగ్

బాపట్ల, నవంబరు 02 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సూర్యలంకరోడ్డులో గల కస్తూర్బా బీఈడీ కళాశాలలో నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యాపరీక్షలు జరుగుతున్నాయి. గత 6 రోజులుగా జరుగుతున్న ఈ పరీక్షలలో మాస్‌కాపీయింగ్‌కు పెద్దఎత్తున పాల్పడుతున్నట్లు సమాచారం. విద్యార్థుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తూ ఇష్టానుసారంగా మాస్ కాపీయింగ్‌ను ప్రోత్సహిస్తున్నారని, డబ్బులివ్వని విద్యార్థులను వేరు చేసి ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిసింది. ఈ విషయమై విద్యార్థులు కళాశాల దగ్గర పెద్దఎత్తున విమర్శలు చేస్తున్నారు. వీరి వైఖరి వల్ల అనేకమంది పరీక్షకు గైర్హజరవుతున్నట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉమ్మడి గుంటూరు అండర్ - 19 నెట్ బాల్ జట్టు ఎంపిక


ఉమ్మడి గుంటూరు జిల్లా నెట్ బాల్‌కు ఎంపికైన క్రీడాకారులు

చిలకలూరిపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్-19 నెట్ బాల్ జట్ల ఎంపికను చిలకలూరిపేట పట్టణంలోని ఏఎంజీ పాఠశాల ప్రాంగణంలో శనివారం ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ - 19 కార్యదర్శి నరసింహారావు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయి. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుంటూరు జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీల్లో ఈ బాల, బాలికల జట్లు ఆడనున్నాయి. అండర్ - 19 బాలుర జట్టుకు అఖిల్, మనోజ్ కుమార్, గోపీకృష్ణ, నిఖిల్, విష్ణు, అహమ్మద్ అర్షాఫ్, నాగ శివ, నరేంద్ర, డానీ, చరణ్, దుర్గా ప్రసాదు, సాయికృష్ణ, కౌశిక్ ఎంపికయ్యారు. కాగా బాలికల జట్టుకు సంజన, అంజు, సాహీర, వెంకట రమణ, హస్న, యమున శ్రీ, శ్రీదివ్య, మౌనిక, సానియా, లిఖిత, జెస్సిక, అర్చనలు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. వారిని సహాయ కార్యదర్శి పద్మాకరరావు, హెచ్ఎం కృపాదానం తదితరులు అభినందించారు.

విద్యార్థులను చితకబాదిన హాస్టల్ వాచ్‌మన్

● ఇద్దరికి తీవ్ర గాయాలు
● వాచ్‌మన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు


తల్లిదండ్రులను విచారిస్తున్న ఎస్ఐ మధుపవన్

పెదనందిపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు విద్యార్థులను హాస్టల్ వాచ్‌మన్ చితకబాదిన సంఘటన శనివారం మండల కేంద్రం పెదనందిపాడులో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు అమరావతి మండలం చిలుమూరు గ్రామానికి చెందిన గోవిందు నాగార్జున, లక్ష్మీఅన్నపూర్ణల ఇద్దరు కుమారులు జి. జ్యోతిరాజేష్, మోహన్‌ఆదిత్యలు ఈ ఏడాది స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహంలో చేరి జిల్లా పరిషత్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు. ఇటీవల దీపావళి పండగకు ఇంటికి వెళ్లారు. సెలవులు ముగియడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాల వద్ద వదిలిపెట్టేందుకు వచ్చారు. పాఠశాలకు వెళ్లమంటూ ఇరువురు విద్యార్థులు ఏడుస్తుండగా తల్లిదండ్రులు నచ్చజెప్పి వారిని వదిలిపెట్టి వెళ్లి పోయారు. అప్పటికే పాఠశాల వద్ద హాస్టల్ వాచ్‌మన్ విద్యార్థులను ఎందుకు ఏడుస్తున్నారు, పాఠశాలకు ఎందుకు వెళ్లరని మందలించి విచక్షణారహితంగా కొట్టారు. దీంతో ఇరువురు తలకు, కాళ్లకు గాయాలవ్వడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారిని స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. దీనిపై తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధుపవన్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వనజాక్షికి ఘన నివాళి


అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాతృమూర్తి వనజాక్షి అంత్యక్రియలు శనివారం ఏలూరు జిల్లా పెదవేగి గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరయ్యారు. వనజాక్షి భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

స్కూల్ వ్యాన్ తగిలి బాలుడు మృతి

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూల్ వ్యాన్ తగిలి 8 నెలల బాలుడు మృతి చెందిన సంఘటన బాపట్ల మండలం చెరువుజమ్ములపాలెంలోని ఆనంద నగర్ ఎస్సీకాలనీలో శనివారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం మోచర్ల కృపాశేఖర్, సౌమ్యసునన్న దంపతులకు లేకలేక పుట్టిన మోచర్ల ప్రకాష్‌బాబును శనివారం బిడ్డ మేనత్త కృపావరం రోడ్డు పక్కనే ఆడిస్తుంది. ఆ సమయంలో స్కూల్‌వ్యాన్ పిల్లలను ఎక్కించుకునేందుకు అక్కడకు వచ్చి ఆగింది. పసిబిడ్డతో వెళ్లి వ్యాన్ దగ్గర కృపావరం నిలబడింది. కొద్దిసేపటికి వ్యాన్ కదలటంతో ఆదమరచి ఉన్న వారికి తగిలి కిందపడ్డారు. దీంతో బాలుడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కృపావరంకు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని ఏరియా వైద్యశాలకు తీసుకొచ్చి గ్రామస్తులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. దీంతో రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 31,087 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 30,242 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది. వీటిలో 16వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా కృష్ణా నదికి విడుదల అవుతున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

అంతర్‌కళాశాల క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలు

పిట్టలవానిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం కేవీ ఆర్‌కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాల అంతర్ కళాశాల క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలు స్త్రీ, పురుషులకు నిర్వహించటం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాద్ తెలిపారు. ఈ పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలను మంగళూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఆలిండియా క్రాస్ కంట్రీ పోటీలలో పాల్గొని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాల స్త్రీ, పురుషుల జట్లను ఎంపిక చేయటం జరుగుతుందన్నారు. ఈ ఆలిండియా పోటీలు మంగళూరు యూనివర్సిటిలో ఈనెల 18, 19న నిర్వహించటం జరుగుతుందని, ఎంపికైన స్త్రీ, పురుష జట్లకు కేవీఆర్‌కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో కోచింగ్ క్యాంప్‌లు నిర్వహించబడునని తెలిపారు.

సంగుపాలెంలో ఎస్‌ఐ పల్లె నిద్ర

పిట్టలవానిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా సంగుపాలెం గ్రామపంచాయతీలో చందోలు పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస పల్లె నిద్ర చేశారు. ఎస్‌ఐ సచివాలయంలో బస చేశారు. ఎస్‌ఐ స్వామి శ్రీనివాస్ గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సంగుపాలెం గ్రామంలో శాంతియుత వాతావరణం కలిగియుండాలని గ్రామస్థులను కోరారు. ఎస్‌ఐను టీడీపీ నాయకురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎనికేపల్లి శివకుమారి, మహిళా పోలీసు కరీమున్నీసా, డాక్టర్ అబ్రహం, వెస్లీ సోపాటి, నాయకులు, గ్రామస్థులు సీహెచ్ వెంకటస్వామి, వై.జయేంద్ర, ఎనికేపల్లి బుల్లి అబ్బాయి, కమ్మ కాలేబు, ఫీల్డ్ అసిస్టెంట్ వై.నాగరాజు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్ర్కీనింగ్ టెస్ట్ నిర్వహిస్తాం

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వటానికి ఈనెల 10వ తేదీన స్ర్కీనింగ్ నిర్వహించటం జరుగుతుందని జిల్లా షెడ్యూల్ కులాల సాధికారిత అధికారిణి జె.రాజదెబోరా తెలిపారు. టెస్టుకు సంబంధించిన సమాచారం దరఖాస్తులో పొందుపరిచిన మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం పంపటం జరుగుతుందని ఆమె తెలిపారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ దరఖాస్తుదారులు శిక్షణ కొరకు ఎంపిక చేసేందుకు నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టుకు హాజరుకావాలని ఆమె కోరారు.

ఆర్‌ఐగా ఫణికుమార్

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఫణికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో భట్టిప్రోలు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన పి.రామకృష్ణ పల్నాడు జిల్లా వెల్లటూరు మండలానికి బదిలీ అయ్యారు. అమృతలూరు మండల ఆర్‌ఐగా పని చేస్తున్న ఫణికుమార్ బదిలీపై భట్టిప్రోలు ఆర్‌ఐగా వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆర్‌ఐను అభినందించారు.

మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బాపట్ల మెయిన్‌లైన్ ఫెయిల్ అయిన కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదలైందని విద్యుత్ అధికారులు తెలిపారు. మండలమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో కర్లపాలెం మండలం అంధకారమైంది. దీంతోపాటు దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రూ.30 లక్షలతో సౌకర్యాల రూపకల్పన

● తహసీల్దార్ షేక్ సలీమా



తహసీల్దార్ షేక్ సలీమా

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించటానికి విచ్చేసే భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు 30 లక్షల రూపాయలతో ప్రతిపాదనలు చేసినట్లు తహసీల్దార్, అడవిగ్రామపంచాయతీ స్పెషలాఫీసర్ షేక్ సలీమా తెలిపారు.



ఫటా ఫట్

కార్తీకమాసంలో తీరంలో ఏర్పాట్లు ఏమిటి?

తహసీల్దార్ : సూర్యలంక సముద్రతీరానికి విచ్చేసే భక్తులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం పంచాయతీ నుంచి 30 లక్షల రూపాయలు ఖర్చు చేయాలని ప్రతిపాదనలు చేశారు.

నిధులు పరిస్థితి ఏమిటి..?

తహసీల్దార్ : రెండు నెలల పాటు తీరంలో టోల్‌గేట్ ఏర్పాటు చేసుకునేందుకు నిర్వహించిన వేలంపాటలో 19.50 లక్షల రూపాయలు వచ్చాయి. వీటితోపాటు పంచాయతీ సాధారణ నిధులు ఖర్చు చేస్తాం.

ఏయేశాఖల అధికారులు భాగస్వాములౌతున్నారు?

తహసీల్దార్ : మండలపరిషత్, ఆర్ అండ్ బి, మత్స్యశాఖ, రెవెన్యూశాఖలతోపాటు మున్సిపల్ అధికారుల భాగస్వామ్యంతో ఏర్పాట్లు చేస్తున్నాం.

ఎలాంటి ఏర్పాట్లు చేశారు...?

తహసీల్దార్ : తాగునీటి సౌకర్యం, తాత్కాలిక టాయిలెట్స్, జల్లు స్నానాలకు షవర్లు, ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయటం జరిగింది. అవసరమైతే మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

భక్తుల రక్షణకు ఏవిధమైన చర్యలు చేపట్టారు?

తహసీల్దార్ : నిరంతరం గస్తీతోపాటు పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రమాదాలు జరగకుండా హెచ్చరికలు చేస్తూ గజఈతగాళ్ళ పర్యవేక్షణ ఏర్పాటు చేయటం జరిగింది. అన్నిశాఖల అధికారులు డ్యూటీ ప్రకారం తీరంలో విధులు నిర్వహిస్తూ భక్తులు, పర్యాటకుల భద్రతకు చర్యలు చేపడతారు.

నైట్ హాల్ట్ సర్వీసులు పునరుద్ధరించరూ!

● లంక గ్రామాల ప్రజల వేడుకోలు

కొల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ నైట్ హాల్ట్ సర్వీసులను పునరుద్ధరించాలని లంక గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు. కొల్లూరు మండలంలోని కొత్తూరు లంక, గాజుల్లంక, తిప్పలకట్ట, జువ్వలపాలెం గ్రామాలకు గతంలో నైట్ హాల్ట్ సర్వీసులు ఉండేవి. వివిధ కారణాలతో ఆయా సర్వీసులను ఆర్టీసీ అధికారులు నిలిపి వేశారు. తిప్పలకట్ట నైట్ హాల్ట్ సర్వీసును కొన్నాళ్ల పాటు కొనసాగించినప్పటికీ ఆ సర్వీసును కూడా నిలిపి వేశారు. అయితే తిప్పలకట్ట నైట్‌హాల్ట్ సర్వీసు విజయవాడ-చెన్నై పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. సర్వీసు నిలుపుదలతో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని రైలు ప్రయాణికులు నైట్ హాల్ట్ సర్వీసులు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించక తప్పడం లేదు. దీని వల్ల ప్రయాణికుల జేబులకు చిల్లు పడుతుంది. తమ గ్రామం నుంచి తెనాలి రైల్వే స్టేషన్‌కు పినాకిని ఎక్స్‌ప్రెస్‌ను అందుకునేందుకు ఆటోకు దూరభారాన్ని బట్టి రూ.500-600 చెల్లించుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు వాపోతున్నారు. గతంలో తిప్పలకట్ట సర్వీసు తమకు ఎంతో ఉపయోగంగా ఉండేదని పినాకిని ఎక్స్‌ప్రెస్‌కు వెళ్లే ప్రయాణికులు చెబుతున్నారు. లంక గ్రామాల ప్రజలు నైట్ హాల్ట్ సర్వీసుల రద్దు వల్ల ఎన్నో ప్రయోజనాలు కోల్పోయారు. ఆయా సర్వీసులు ఉన్నప్పుడు తాము పండించిన పంట ఉత్పత్తులు అరటి, కూరగాయ వంటి పంటలను తెల్లవారుజామున ఆర్టీసీ బస్సుల ద్వారా తెనాలికి చేర్చుకుని అక్కడ నుంచి మార్కెట్‌లకు తక్కువ ఖర్చుతో చేరవేసుకునేవారు. ఇప్పుడు ఆటోల ద్వారా ఆయా పంట ఉత్పత్తులు మార్కెట్‌లకు తరలించడం వల్ల తమకు గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాల రైతులు, పినాకిని రైల్వే ప్రయాణికులు సౌకర్యార్థం నైట్ హాల్ట్ సర్వీసులు పునరుద్దరించాలని, తక్షణమే తిప్పలకట్ట



కొత్తూరులంక-తెనాలి ఆర్టీసీ సర్వీసు బస్సు

నైట్‌హాల్ట్ సర్వీసు పునరుద్దరిస్తే రైల్వే ప్రయాణికులకు మేలు చేసిన వారు అవుతారని ఆర్టీసీ అధికారులను వేడుకుంటున్నారు.

వినతి పత్రం అందిస్తే సర్వీసు పునరుద్ధరణకు కృషి

ఇటీవల కొంత మంది నైట్ హాల్ట్ సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు. ఆయా గ్రామాల ప్రజలు నైట్ హాల్ట్ సర్వీసుల కోసం వినతి పత్రం అందిస్తే ఉన్నతాధికారులకు నివేదించి సర్వీసుల పునరుద్దరణకు కృషి చేస్తాం. **- తెనాలి ఆర్టీసీ డీఎం రాజశేఖర్**

రహదారుల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



రోడ్డు అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో గుంతలు పడి ఉన్న రహదారుల అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మిషన్ పార్ట్ హోల్ ఫ్రీ ఏపీ గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మూల్పూరు వయా పోతుమర్రు జంపని రహదారి 20 లక్షల రూపాయలతో చేపట్టే పనులకు శనివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆనందబాబు మాట్లాడుతూ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వంలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, కనీసం మరమ్మతులు కూడా చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతలు పూడ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 850 కోట్ల రూపాయలను విడుదల చేశారని చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని కూచిపూడి లాకు- గోవాడ వరకు రహదారి అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం అవుతాయని చెప్పారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రం అప్పుల బాట నుంచి బయట పడి అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మారుతీ శేషమాంబ, యలవర్తి బ్రహ్మానందం, మొవ్వ శ్రీనివాసరావు, షాలెంరాజు, శరణు గిరి, మూల్పూరు ఏసురత్నం, ఐమళ్ళ ప్రమోద్, మూల్పూరు మాణిక్యాలరావు, జాస్తి ప్రభాకరరావు, షేక్ అనీఫ్, జంపని ఉప సర్పంచ్ పళ్ళా వాసుదేవరాయుడు, స్థానిక పార్టీ నాయకులు, ఆర్ అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

గుంతలులేని రహదారి పనులు ప్రారంభం : అనగాని

రేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో రహదారులు అభివృద్ధి చేసిన దాఖలాలు లేవని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంతలు లేని రోడ్లులు సాధనగా ప్రభుత్వం ముందడుగు వేసిందని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం నల్లూరుపాలెం-తుమ్మలరోడ్డు, రేపల్లె నుంచి నిజాంపట్నం రోడ్డు అభివృద్ధి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. ఆయన మాట్లాడుతూ తీరప్రాంతంలో రహదారులు అభివృద్ధికి నోచుకోలేకపోవటంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు గురయ్యారన్నారు. దీనికితోడు ప్రమాదాలకు నిలయంగా రహదారులు మారాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలలో రహదారులపై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాల్లో రహదారులు అభివృద్ధి కోసం రూ.4,500 కోట్లతో సీసీ రోడ్లు వేసేందుకు అనుమతులు అందించారని రేపల్లె నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో రహదారుల అభివృద్ధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య పాల్గొన్నారు.



నల్లూరుపాలెంలో రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న శివప్రసాద్

పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

పిట్టలవానిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలో ఎమ్మెల్సీ, ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాలను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ 2021 నవంబరు 1వ తేదీ ముందుగా డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు సలహేల కేంద్రంను సంప్రందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఖాజీపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు దుండు శ్రీనివాస్‌రాజు, టీడీపీ మండల నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, కనుమూరి సాంబమూర్తిరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు, రిత్విక్ వర్మ, కడియాల ప్రసాద్, మహ్మద్‌రజాక్, మహిళా నాయకులు సరోజని, టీడీపీ కార్యాలయ సిబ్బంది నర్రాగోపి, ఐటిడిపి సభ్యులు మట్లపూడి నిఖిల్ పాల్గొన్నారు.

భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవాలి : సీపీఎం



సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గతంలో జరిగిన ఉద్యమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య తెలిపారు. సీపీఎం బాపట్ల జిల్లా మొట్టమొదటి మహాసభలు జయప్రదంకై శనివారం ఆహ్వాన సంఘం ఏర్పాటు చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో సీనియర్ నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహాసభలకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. కార్పొరేట్ కోసం జెమిలి ఎన్నికలు అంటూ బీజేపీ రాజ్యాంగస్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ప్రజల అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు సనాతనధర్మం పేరుతో హిందుత్వ అజెండాను ప్రజలపై రద్దుతుందన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా జెడ్ బాషాను, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ గంగయ్య, కోశాధికారిగా కె.నాగేశ్వరరావులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ మజుందార్, టి.కృష్ణమోహన్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బారక్‌పూర్ తిరుగుబాటు అజరామరం

● జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి రాజాదెబోరా



సభలో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారిణి జి.రాజాదెబోరా

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఆంగ్లేయుల అరాచకాలకు వ్యతిరేకంగా దేశం లో జరిగిన మొట్టమొదటి పోరాటం బారక్‌పూర్ తిరుగుబాటు అని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారిణి జి.రాజాదెబోరా అన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాలలో శనివారం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ అధ్యక్షతన బారక్‌పూర్ తిరుగుబాటు ద్విశతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి రాజాదెబోరా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో బారక్‌పూర్ తిరుగుబాటు మహోజ్వల ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. షేక్ సంజయ్ సుల్తానా ప్రథమ బహుమతి, యు.రూపవతి ద్వితీయ బహుమతి గెలుపొందారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సోమశేఖరరావు, డాక్టర్ గౌతమి, డాక్టర్ బ్లెస్సీసాగర్, వంకాయలపాటి హరిబాబు, భార్గవ్, చినభూషణం, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రీయ గ్రామస్వరాజ్, అభియాన్ నిధులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మరో రెండు బ్యాచ్‌లకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ నిర్వహించనున్నట్లు బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీలలో, 7, 8 తేదీలలో శిక్షణ రెండు బ్యాచ్‌లకు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, టివోటీలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, లైన్‌డిపార్ట్‌మెంట్ అధికారులు శిక్షణకు హాజరై తదుపరి ఈనెల 12 నుంచి 16 వరకు మండలాలలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

గాయత్రి పీఠాధిపతి సాంబిరెడ్డి మృతి

కర్లపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలో ఉన్న దేవాలయం గాయత్రి పీఠాధిపతి ఆట్ల సాంబిరెడ్డి శనివారం మృతి చెందారు. బాపట్ల నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఆట్ల బాల శంకరరెడ్డి తాత అయిన గాయత్రి పీఠాధిపతి సాంబిరెడ్డి మృతికి టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు, నాయకులు పలువురు మృతదేహంపై పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బుల్లియ్య, అంగలకుదురు ప్రకాశరావు, బాలశంకరరెడ్డి తదితరులు ఉన్నారు.



పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు (అంతరచిత్రంలో) ఆట్ల సాంబిరెడ్డి (ఫైల్)

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు వీజీఆర్ఎం విద్యార్థి ఎంపిక



పవన్‌కళ్యాణ్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ గిరిధర్‌కుమార్

బాపట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి అండర్ -17 కబడ్డీ పోటీలకు బాపట్ల వీజీఆర్ఎం విద్యార్థి మేడిబోయిన పవన్‌కళ్యాణ్‌రెడ్డి ఎంపికయ్యాడు. గత నెల 28, 29 తేదీలలో కడప జిల్లా రాయచోటిలో జరిగిన అండర్-17 కబడ్డీ పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో ఆడటానికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఎంపికైన ఏకైక క్రీడాకారిణిగా పవన్‌కళ్యాణ్‌రెడ్డి నిలిచారని కళాశాల డైరెక్టర్ అంబటి గిరిధర్‌కుమార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి

పిట్టలవానిపాలెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఖాజీపాలెం గ్రామపంచాయతీలోని మండేవారిపాలెం గ్రామానికి చెందిన బడుగు ధీనరావు శుక్రవారం రాత్రి ఖాజీపాలెం సెంటర్ నుంచి ఇంటికెళుతుండగా అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మార్గ మధ్యలో ఆపి దాడికి పాల్పడ్డారు. ధీనరావుకు తీవ్ర గాయాలు కావటంతో అతనిని కుటుంబ సభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించారు. ఈ విషయంపై చందోలు ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్ చెప్పిన కథన ప్రకారం... బడుగు ధీనరావు ఓ హోటల్‌లో పనిచేస్తుండగా అంతకముందు అదేగ్రామానికి చెందిన దండుమూడి ఆశీర్వాదం పని చేసేవాడు. ఆశీర్వాదంను కొంతకాలం క్రితం హోటల్‌లో ఉద్యోగం నుంచి తొలిగించారు. ఆ స్థానంలో ధీనరావు ఆ హోటల్‌లో ఉద్యోగంలోకి చేరాడు. అది మనసులో పెట్టుకున్న ఆశీర్వాదం మరో స్నేహితుడు దోనేపాటి శోభన్‌తో కలిసి ధీనరావుపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


తీరం ఒడ్డున కార్తీక మాస పూజలు

బాపట్ల రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంతో పవిత్రమైన కార్తీక మాసం శనివారం ప్రారంభం కావటంతో సూర్యలంక తీరంలో తెల్లవారుజాము నుండే మహిళా భక్తులు తీరంలో స్నానాలు ఆచరించి అనంతరం తీరం ఒడ్డున ఇసుక తిమ్మెలతో శివలింగాలను తయారు చేసి కార్తీకదీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు కార్తీకదీపాలను సముద్రనీటిలో వదిలి నమస్కారాలు చేశారు. తీరం ఒడ్డున కార్తీకపూజలు నిర్వహించిన అనంతరం బాపట్లలోని శివాలయాలకు మహిళా భక్తులు వెళ్ళి స్వామివారికి పూజలను నిర్వహించారు. కార్తీకమాసం ప్రారంభం అవ్వటం మొదటిరోజు బాపట్ల పట్టణ, మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఓంనమఃశివాయ అనే మంత్రం దేవాలయాలలో మారుమ్రోగాయి.

భక్తులతో కిటకిటలాడిన శైవక్షేత్రాలు

కొల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. కార్తీక మాసం ప్రారంభం కావడంతో భక్తులు తెల్లవారు జామున శివాలయాలకు చేరుకుని స్వామివారిని దర్శించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. కొల్లూరులోని అనంతభోగేశ్వర స్వామి ఆలయం, చిలుమూరులోని ఉభయ రామేశ్వరస్వామి క్షేత్రం, కోటిపల్లిలోని సోమశేఖరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామి వారిని దర్శించుకున్నారు. చిలుమూరు వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు ఆచరించి పూజల్లో పాల్గొన్నారు.

శివాలయాల్లో కార్తీక మాస అభిషేకాలు ప్రారంభం



జంపని రామేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు

వేమూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా శనివారం నుంచి మండల పరిధిలోని శివాలయాలలో నిత్య శివాభిషేకాలను ప్రారంభించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం అభిషేకాలను నిర్వహించి స్వామివారిని విశేషంగా అలంకరించిన అనంతరం ప్రత్యేక సంకల్పంతో అష్టోత్తర సహస్ర నామాలను ప్రారంభించారు. కార్తీక మాస పూజలు సందర్భంగా భక్తులు శివాలయాలను సందర్శించి వారి గోత్రనామాలతో నక్షత్ర పూజలను ప్రారంభించారు. శివ, విష్ణు ఆలయాలలో మాస దీక్షతో ఆకాశ దీపాలు వెలిగించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయాలకు వెళ్లిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. చావలి వాలేశ్వరాలయం, వేమూరు రామలింగేశ్వరాలయం, జంపని రామేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మాజీ సర్పంచ్‌పై పరువు నష్టం దావా



మాట్లాడుతున్న సాయిబాబా

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తప్పుడు కేసులు పెట్టి తన పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించినందుకు పరువు నష్టం దావా వేసినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, 2017లో భట్టిప్రోలు పంచాయతీ సర్పంచ్‌గా కంభం మరియమ్మ ఉన్నారు. ఆ సమయంలో తనతో పాటు మరో ఇద్దరు పంచాయతీ సభ్యులపై గుంటూరు జిల్లా కోర్టులో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు దాఖలు చేసిందని, కేసు విచారణ అనంతరం 2024 మార్చిలో న్యాయస్థానం కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. తనపై అక్రమంగా ఎస్సీ ఎస్టీ కేసు దాఖలు చేసి ఏడు సంవత్సరాల పాటు మానసిక, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేసిందని, కేసులో తాను నిరపరాధిగా రుజువు కావడంతో పరువు నష్టం రూ.10 లక్షలు రేపల్లె జూనియర్ సివిల్ కోర్టులో కేసు దాఖలు చేయడం జరిగిందన్నారు. కోర్టు ఈ నెల 4వ తేదీన మాజీ సర్పంచ్‌ని హాజరుకావాలని సమన్లు కూడా జారీ చేసినట్లు సాయిబాబా తెలిపారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

కొల్లూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావును గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కొల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసి పరిష్కరించే పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.వినయ్, శ్రీనివాసరావు, కోశాధికారి వెంకటేష్‌రెడ్డి, కార్యదర్శి వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన మహిళా కార్మికులను ఆదుకోవాలి



బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ వెంకటమురళిని కోరుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల ప్రమాదానికి గురైన మహిళా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని బాపట్ల జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాల వద్ద బాధితులను పరామర్శించటానికి వచ్చిన కలెక్టర్ వెంకటమురళిని శనివారం సీఐటీయూ నాయకులు కలుసుకుని బాధితులను ఆదుకోవాలంటూ కోరారు. మణిలాల్ మాట్లాడుతూ నైపుణ్యంలేని సూపర్‌వైజర్లను ఉంచటం వల్లే కెమికల్ లీక్ అయ్యిందని, దీనికారణంగా మహిళలు అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. బాధిత మహిళలకు నష్టపరిహారం అందించాలని, యాజమాన్యంపై చర్యలు తీసుకుని పోలీసులు కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వివిధ ప్రజా సంఘాల నాయకులు కె.రమేష్, ఎస్.శివశంకర్, ప్రహ్లాదకరు, సురేష్‌బాబు, తదితర మహిళా కార్మికులు పాల్గొన్నారు.

అడుగుపెడుతూనే కొత్త ప్రపంచం


- రెస్టారెంట్ ఆన్ వీల్స్
- రైల్వే కోచ్ రెస్టారెంట్లకు పెరుగుతున్న ఆదరణ

రెస్టారెంట్లలో కొత్తదనాన్ని కోరుకుంటున్న వారు వింతైన అనుభూతిని పొందాలనుకుంటున్నారా! అయితే, రెస్టారెంట్ ఆన్ వీల్స్‌గా పిలవబడే రైలు కోచ్ రెస్టారెంట్లకు వెళ్లాల్సిందే. లోపలికి అడుగు పెడుతూనే శీతలమైన రూం టెంప రేచర్, కళ్లు మిరుమిట్లు గొలిపే ఇంటీరియర్స్, లైటింగ్స్, ఆరోగ్యకరమైన వాతావరణం మదిని దోచేస్తుంటాయి. ఇక రైలు బోగీలో ప్రయాణిస్తూ ప్రీతిపాత్రమైన వంట కాలను ఆరగిస్తుంటే 'ఆహా! ఆ మజానే వేరు' అని కుర్ర కారు అంటున్నారు. గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ వైపున ఉన్న రైలు కోచ్ రెస్టారెంట్లు విశేషంగా ఆకర్షించడమే కాదు రోజురోజుకు ఆదరణని పెంచు కుంటున్నాయి. 24 గంటలు వారంలో ఏడు రోజులు సేవ లందించే రెస్టారెంట్లు కావడం వీటికి ప్లస్ పాయింట్. అర్ధరాత్రి అయినా అపరాత్రి అయినా వెళ్లి ఇష్టమైన ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు.


గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గతంలో పాతబడిన భారీ పడవలను సముద్ర తీరానికి తీసుకొచ్చి వాటిని సందర్శన ప్రదేశంగా చేసేవారు. ఆ తర్వాత విమానాల వంతు వచ్చింది. విమానాన్ని రెస్టారెంట్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో రైల్వేలో ఫుడ్ కాంట్రాక్టర్‌గా ఉన్న కోటిరెడ్డి అనే వ్యక్తి వీటి అనుభవం ద్వారా పాడుబడిన రైలు బోగీని రెస్టారెంట్‌గా ఎందుకు చేయకూడదని ఆలోచన చేశారు. ఆ ఆలోచన వచ్చిందే తడవుగా అప్పటి గుంటూరు డీఆర్ఎం మోహన్‌రాజాని సంప్రదించి తన ప్రణాళికను వివరించారు. అప్పటికే గుంటూరు రైల్వే డివిజన్‌లో శిథిలావస్థ స్థితికి చేరుకొన్న ఓ రైలు బోగీ ఉండటం, దాని ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో డీఆర్ఎం అంగీకరించారు. కోచ్ ఓవర్ హాలింగ్ డిపో నుంచి ఆ బోగీని తెప్పించి తొలుత గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపున అటు రైలు ప్రయాణికులు, ఇటు బయటి ప్రజలకు ఆమోద యోగ్యంగా ఉండే ప్రదేశంలో ఏర్పాటు చేయించారు.

దీర్ఘకాలిక ప్రయోజనాల దృష్ట్యా కాంట్రాక్టర్ కోటిరెడ్డి రైలు బోగీని అందంగా తీర్చిదిద్దారు. విలాసవంతంగా ఉండేలా మెరుగులు అద్దించారు. ఇందుకోసం ఖర్చుకు ఏమాత్రం వెనుకాడకుండా రూ.50 లక్షలు వెచ్చించారు. ఇంత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ఏమిటన్న విమర్శలు ఆ సందర్భంలో లేకపోలేదు. అయినప్పటికీ ఆయన ముందుకెళ్లడంతో కోచ్ రెస్టారెంట్ అనతి కాలం లోనే రూపుదిద్దుకొంది. ఒకేసారి 50 మందికి పైగా కూర్చునేలా సీటింగ్‌ని తీర్చిదిద్దారు. ప్రతీ ఓపెన్ కంపార్టుమెంట్ వద్ద నలుగురు కూర్చుని కబుర్లు చెప్పు కొంటూ ఫుడ్ ఆర్డర్ చేసి లాగించేయొచ్చు. ప్రతీ కంపార్టుమెంట్‌కు ఎదురుగా అద్దంతో కూడిన కిటికీ వచ్చేలా డిజైన్ చేశారు. దీని వలన రైలులో ప్రయాణిస్తూ భోజనం చేస్తున్న అనుభూతి కలుగుతుంది.

రూ. 50 లక్షలతో ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్‌ల అభివృద్ధి



కోచ్ రెస్టారెంట్ వెలుపల ఫుడ్ ఎక్స్‌ప్రెస్


కోచ్ రెస్టారెంట్ లోపలి భాగం


వంటకాలు ఆరగిస్తున్న కస్టమర్లు



రైల్వే కోచ్ రెస్టారెంట్

అన్ని ప్రాంతాల ప్రయాణికులు ఇష్టపడే వంటకాలు

రైల్వేస్టేషన్ అనగానే ఒక గుంటూరు జిల్లాకు చెందిన ప్రయాణికులే రారు. దేశం నలుమూలల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫుడ్ మెనూని రూపొందించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రింతా వెజ్, నాన్‌వెజ్ వంటకాలు వేడివేడిగా వడ్డిస్తుంటారు. నార్త్ ఇండియన్స్ ఇష్టపడే వంటకాలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. ఇక అన్నిరకాల బెవరేజస్‌ని అందు బాటులో ఉంచారు. తాజా పండ్ల రసాలు, చైనీస్ ఫుడ్ ఐటమ్స్ కూడా ఆర్డర్ చేసిన కొద్దిసేపటికే తీసుకొచ్చి సర్వ్ చేస్తున్నారు. రేట్లు కూడా సాధారణ రెస్టారెంట్లలో మాదిరే ఉన్నాయి.

రైల్వేస్టేషన్ పశ్చిమ వైపునే డిమాండ్ పెరగాలి

రైల్వేస్టేషన్ తూర్పు వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు 24 గంటలు జనాదరణ ఉంటోంది. ఈ ఏడాది ఎన్నికలకు ముందు వెస్ట్ టెర్మినల్ వైపున ఏర్పాటు చేసిన కోచ్ రెస్టారెంట్‌కు ఇంకా డిమాండ్ పెర గాల్సి ఉంది. వెస్ట్ టెర్మినల్ ఇంకా అధికారికంగా ఓపెన్ కాకపోవడం, ఎక్కువ రైళ్లు ఒకటో నంబరు ప్లాట్‌ఫాంకే తీసుకొంటుండటంతో ప్రయాణికుల రద్దీ అటు వైపునే ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో వెస్ట్ టెర్మినల్ త్వరగా ప్రారంభించి కొన్ని ముఖ్యమైన రైళ్లను ఏడో నెంబరు ప్లాట్‌ఫాంకు తీసుకుంటే ఇటువైపున కూడా రాకపోకలు పెరిగి.. వెస్ట్ సైడ్ కోచ్ రెస్టారెంట్‌కు ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. అలాగా, ఈస్ట్ సైడ్ రెస్టారెంట్‌కు ఉన్నంత పబ్లిక్ యాక్సెస్ వెస్ట్ సైడ్ లేక పోవడం కూడా దీనికి కొంత ప్రతికూలంగా మారింది.

పోలీసుల భయం ఉండదు

సాధారణంగా గుంటూరు నగరంలో ఏ రెస్టారెంట్ అయినా రాత్రి 10 నుంచి 11 గంటల మధ్య మూసేయాలి. ఆ తర్వాత తెరిచి ఉంచితే పోలీసులు సైరన్ వేసుకొంటూ వచ్చి చర్యలు తీసుకొంటారు. దీని వలన అటు రెస్టారెంట్ల నిర్వాహకులు, ఇటు వినియోగ దారులకు ఇబ్బందికరం. కాగా, రైల్వే కోచ్ రెస్టారెంట్ల వద్ద అలాంటి భయం ఉండదు. ఇందుకు కారణం ఈ రెస్టారెంట్లకు 24 గంటల అనుమతి ఉంది. వీటికి పార్కింగ్ ప్రదేశాలు కూడా ఉన్నాయి. దీని వలన వాహనాలు చోరీకి గురవుతాయనే భయం ఉండదు.



బాలకుటీర్ నిర్వహించే లలితా కళా పోటీలకు ఆహ్వానం

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లలిత కళలను ప్రోత్సహించటం కోసం సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన గరిగె ప్రభావతి స్మృతి దినోత్సవం సందర్భంగా శ్రీ వెంకటేశ్వర బాల కుటీర్ 29 ఏళ్ళుగా డిసెంబరు 10వ తేదీన లలిత కళా ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ నన్నపనేని మంగాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ లలిత కళల్లో ప్రతిభావంతులైన బాలలకు 'ప్రతిభా పల్లవం' పురస్కారాన్ని, బాల సాహితీ సృజనకర్తలకు 'మంగాదేవి బాల సాహిత్య పురస్కారాన్ని' సాహిత్య రంగానికి విశేష సేవలందిస్తున్న మహిళలకు మాలతీ ప్రమదా సాహితీ పురస్కారాన్ని అందజేసి సత్కరిస్తున్నట్లు చెప్పారు. బాలల సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించటానికి రాష్ట్ర స్థాయిలో వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని, విద్యార్థులను, గురువులను ఆయా పోటీలలో పాల్గొనేలా ప్రోత్సహించా ల్సిందిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు డాక్టర్ మంగాదేవి విజ్ఞప్తి చేశారు. పోటీలు గాత్రం, వాద్య సంగీతంలో వ్యక్తిగతంగాను, బృంద గానాల రూపంలోనూ ఉంటాయని, వాటితో పాటు చిత్రలేఖనం, కథా రచన, లేఖా రచనలలో కూడా పోటీలు ఉంటాయని తెలిపారు. ఉత్తమస్థానాల్లో నిలిచిన బృందాలకు బహుమతుల కింద ఒక్కొక్క బృందానికి రూ. 5వేలు, రూ. 4వేలు, రూ. 3వేలు, గురువులకు రూ.4వేలు, రూ. 3వేలు, రూ. 2 వేలు బహుమతులు ఉంటాయన్నారు. పోటీదారులు ఆన్‌లైన్‌లో మాత్రమే రిజిష్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. నవంబరు 18 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు నిర్వహించే పోటీల వివరాలను శ్రీ వెంకటేశ్వర బాలకుటీర్, మూడో లైను, శ్యామలానగర్, గుంటూరు (0863-2232405, 9390115480, 7729967589, 8121590409) లో సంప్రదించాలని కోరారు. రిజిస్ట్రేషన్ ఫారం స్కూల్ వెబ్ సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌వీబీకే. ఇన్ లేదా సర్క్యులర్‌లో ఇచ్చిన క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి పొందవచ్చని తెలిపారు.

అండర్ - 19 ఫుట్ బాల్ జిల్లా జట్ల ఎంపిక



అండర్ - 19 ఫుట్‌బాల్ బాల బాలికల జట్లు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్ - 19 బాల బాలికల పుట్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు మండలంలోని నందిగామ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో శనివారం జరిగాయి. ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 110 మంది క్రీడాకారులు హాజరైనట్లు అండర్ - 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి జీ నరసింహారావు తెలిపారు. జట్లకు ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగే 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర జట్టు డీ సాయి కుమార్, ఎం ముఖేష్, వై కార్తీక్, వీ విల్ స్మిత్, ఏ గోపీ సందీప్, జే మోజెష్, ఏ స్టాలిన్, ఏ ఫైజుక్, ఎస్ రేవంత్, జీ గిరి ప్రతాప్, పీ యాసిన్ ఖాన్, షేక్ ఆరీఫ్, జీ ప్రదీప్, షేక్ ఫరీదు, డీ అనేష్; కే నరేష్, ఎం రిషీ, స్టాండ్‌బైలుగా పీ వేణుగోపాల్, షేక్ ఖాజా మొహిద్దీన్, పీ కిరణ్ కుమార్, ఎం వినయ్ తేజ, షేక్ జుబేర్‌లు ఎంపికయ్యారు. బాలికల జట్టు ఎల్ శివ దుర్గ, కే వెంకట త్రివేణి, జీ శ్రీలక్ష్మి, సీహెచ్ జ్ఞాన శ్రీ అర్చన, వీ అఖిల, కే కారుణ్య, ఓ దీవెన, వీ మౌనిక, టీ యామిని, ఎం నవ్య, ఎం అమ్ములు, ఎం పవిత్ర పావని, కే హేమ రాజేశ్వరి, జీ సౌజన్య డీ కోమలి, ఎం శ్రీలక్ష్మి మహేశ్వరి, కే బ్లెసీ, ఎన్ రమ్య, స్టాండ్ బైలుగా కే రాజ్యలక్ష్మి, ఎన్ షబానా, బీ లావణ్య జీ కుసుమలు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు లాకు పిచ్చయ్య, వీ అనీల్ దత్త నాయక్, కే సునీత, యూ సత్యవతి, షేక్ పెద కరిముల్లా, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైల్వేలో గుర్తింపు ఎన్నికల సందడి

- డిసెంబరు 4, 5, 6 తేదీల్లో పోలింగ్
- 4,500 మందికి పైగా ఉద్యోగులకు ఓటు హక్కు
- యూనియన్, సంఘ్‌ల పోటాపోటీగా హామీలు

గుంటూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే గుంటూరు డివిజన్‌లో గుర్తింపు సంఘం ఎన్నికల సందడి నెలకొన్నది. ఎన్నికల నిర్వహణ తేదీలను రైల్వే శాఖ ఖరారు చేయడంతో గత కొన్ని రోజుల నుంచి మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగడం, దశాబ్దం తర్వాత ఎన్నికలు జరగబోతుండటంతో పెద్ద సంఖ్యలో హామీలను గుప్పిస్తున్నాయి. గుర్తింపు సంఘం ఎన్నికల్లో తొలి నుంచి మజ్దూర్ యూనియన్ సత్తా చాటుతూ వచ్చేది. అయితే 2013లో మాత్రం సంఘ్ గెలిచి సంచలనమే సృష్టించింది. ఈ దఫా ఎలాగైనా గెలవాలని మజ్దూర్ యూనియన్, తన పట్టుని మరోసారి నిలుపుకోవాలని ఎంప్లాయిస్ సంఘ్‌లు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. జాతీయ స్థాయి నాయకులను ఆహ్వానించి మధ్యాహ్న భోజన సమయంలో ఉద్యోగులను వ్యక్తిగతంగా కలుసుకొంటూ మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థిస్తున్నాయి.



గుంటూరు రైల్వేస్టేషన్

8వ వేతన సంఘం ఏర్పాటుకు పోరాటం: ఎంవీ ప్రసాద్, డివిజనల్ సెక్రెటరీ



2026 జనవరి 1వ తేదీ నాటికి నివేదికతో 8వ వేతన సంఘం ఏర్పాటు. ఓపెన్ లైన్ డిపార్టుమెంట్ ఉద్యోగు లందరికి రిస్క్, హార్డ్ డ్యూటీ అలవెన్స్. ట్రాక్ మెయిం టెనర్లకు రిస్కు అలవెన్స్ పెంపు, పని భారం తగ్గింపునకు ప్రయత్నం. కీమెన్, మేస్త్రీల కోసం జీపీ 4200. అదనపు 10 శాతం ఎల్‌డీసీఈ అందరికి తెరవడం. ఉద్యోగులం దరికి ద్విచక్ర వాహన భత్యం. అందరికి 8 గంటల పని విధానం. 500 రోజుల వరకు ఆర్జిత సెలవు, పదవీ విరమణ సమయంలో 360 రోజుల ఎన్‌క్యాష్‌మెంట్‌కు మంజూరు ఇప్పించడం. మెడికల్ అలవెన్స్ రూ. 3 వేలు వేసైడ్ స్టేషన్ ఉద్యోగులకు ఇప్పించేందుకు ప్రయత్నం. హెచ్ఆర్ఏ ఎక్స్ తరగతి నగరాలకు 40 శాతం, వై తరగతి నగరాలకు 30 శాతం, జెడ్ క్లాస్ నగరాలకు 20 శాతం పెంచేలా చూడటం. అన్నిరకాల క్వార్టర్లలో ఒక గది ఎయిర్ కండీషనింగ్ చేయించడం. తల్లిదండ్రులకు పాస్, వైద్య సదుపాయాల కల్పన. రన్నింగ్ సిబ్బందికి వారానికి 46 గంటల విశ్రాంతి. 70 శాతం రన్నింగ్ అలవెన్స్ ఆదాయపు పన్ను మినహాయింపు కోసం ప్రయత్నం.

ఏకీకృత పెన్షన్ విధానం అమలుకు ఒత్తిడి: రమణయ్య, సంఘ్ డివిజనల్ సెక్రెటరి



రైల్వేలలో నూతన పెన్షన్ విధానాన్ని(ఎన్‌పీఎస్) రద్దు చేస్తూ పాత పింఛన్ విధానానికి సమానంగా ఏకీకృత పెన్షన్ విధానం(యూపీఎస్) అమలుకు పోరాటం. 8వ పే కమిషన్‌ను త్వరగా ఏర్పాటు చేయించి డాక్టర్ ఆక్రయిడ్ ఫార్ములా ప్రకారం కనీస వేతనం నెలకు రూ. 32,500 ఇప్పించడం. 2020 జనవరి నుంచి 2021 వరకు నిలిపేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ/డీఆర్ తక్షణం విడుదల చేయించేందుకు పోరాడతాం. పీఎల్ బోనస్‌పై ఉన్న శాలరీ సీలింగ్‌ను తొలగించాలి. రైల్వేలో 12 గంటల డ్యూటీని రద్దు చేసి 8 గంటల విధానాన్ని ప్రవేశపెట్టిస్తాం. రైల్వేలో అన్ని కేటిగిరీలకు గ్రేడ్‌పే రూ. 4600లకు బదులుగా రూ. 4800 అమలు చేసేందుకు ఒత్తిడి చేస్తాం. రైల్వేలో పాయింట్స్‌మెన్ కేటిగిరీకి 4 గ్రేడ్ పే స్ట్రక్చర్ అమలుకు రైల్వేబోర్డుతో మాట్లాడతాం. రైల్వే ఉద్యో గుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య చికిత్స, పాస్ సౌకర్యాల కల్పనకు ప్రయత్నం. ట్రాక్ మెయింటెనర్ల పని గంటలు తగ్గించి భోజన విరామాన్ని డ్యూటీలో భాగంగా పరిగణించాలి. ఎన్ఎఫ్ఐఆర్ డిమాండ్ నెంబరు. 1/2022 ప్రకారం ఎల్‌డీసీఈని అందరికి వర్తింపు చేయాలి. కనీసం పాతికేళ్ల సర్వీసు పూర్తి చేసుకొన్న మహిళా ఉద్యోగులు వారి పిల్లలకు ఉద్యోగం ఇచ్చే నిబంధనతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు అవకాశం కల్పించాలి. ఇలా మరికొన్ని హామీలను సంఘ్ ఇచ్చి ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం

బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే చదలవాడ


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అరవింద బాబు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. శనివారం స్థానిక కోడెల శివప్రసాదరావు స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలికల బాస్కెట్‌బాల్ 2024 - 25 పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో ఆడాలని క్రీడాకారులకు సూచించారు. కేవలం చదువుల మీద దృష్టి పెట్టకుండా పిల్లలను తల్లిదండ్రులు క్రీడల వైపు ప్రోత్సహించాలని కోరారు. తొలుత ఆయన క్రీడా జ్యోతిని వెలిగించి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక, రాజకీయాలను విశ్లేషించిన 'మానవాళికి మహోదయం'

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేఎస్ లక్ష్మణరావు, పాల్గొన్న రచయిత పాపారావు తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాల కాలంలో ప్రపంచంలో జరిగిన ఆర్థిక, రాజకీయలను విశ్లేషించిన గొప్ప పుస్తకం 'మానవాళికి మహోదయం' అని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావు రచించిన 'మానవాళికి మహోదయం-అంతం కాదిది ఆరంభం' పుస్తకాన్ని శనివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు. సభకు గుంటూరు క్లబ్ బుక్ రీడర్స్ అధ్యక్షుడు కాపు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ 2008లో ఆర్థిక సంక్షోభం అనంతరం నిర్దిష్టంగా వాస్తవ రూపం దాలుస్తున్న పరిణామాలు రచయిత వాదనలకు తార్కాణంగా ఈ పుస్తకం నిలబడిందన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ 2024లో మరింత ఉధృతంగా కమ్ముకొస్తున్న మాంద్యం మేఘాలు వంటి అంశాలు ఈ పుస్తక ప్రచురణకు రచయితను ప్రేరేపించాయన్నారు. పుస్తక రచయిత పాపారావు మాట్లాడుతూ ప్రపంచ పెట్టుబడిదారి దోపిడీకి గుండెకాయగా, వెన్నుదన్నుగా ఉన్న అమెరికా ఆర్థిక వ్యవస్థ పునాదులు కదిలిపోతున్నాయన్నారు. సమాధిలోకి సామ్రాజ్యవాదం అనే పుస్తకాన్ని 2012లో రచించానని, దానికి మరింత అదనపు సమాచారం జోడించి 'మానవాళికి మహోదయం' పేరుతో మరో పుస్తకాన్ని విడుదల చేశానన్నారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మల్లికార్జునరావు, సీపీఎం నాయకులు భైరగాని శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకత మొదలు

- దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి
- వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై నాలుగు నెలల కాలంలోనే ప్రజా వ్యతిరేకత మొదలైందని మాజీ ఎంపీ, వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. వైసీపీ గుంటూరు నగర అధ్యక్షుడుగా డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ప్రమాణ స్వీకారం శనివారం శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో కూటమి పార్టీలు చేసిన దుష్ప్రచారంతోనే వైసీపీ ఓటమి పాలైందన్నారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన చేశారన్నారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా పోలీసు యంత్రాంగం, ప్రభుత్వం చోద్యం చూస్తుంది తప్ప చర్యలుండటం లేదని విమర్శించారు. ప్రజల పక్షాన కార్యకర్తలు నిరంతరం పోరాడాలన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో సమయం లేదని, 2027లోనే ఎన్నికలు ఉండే అవకాశం ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ జెండా విజయం సాధించేలా పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలతో వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనం ఖాయమన్నారు. మాజీ మంత్రి విడదల రజిని మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం అన్నీ మాయమాటలే తప్ప చేతలు లేవని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలతో ప్రజా వ్యతిరేకత మొదలైందన్నారు. మరో మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళ లపై ఇన్ని అఘాయిత్యాలు జరుగు తుంటే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరుఏమైందని విమర్శించారు. నగర అధ్యక్షుడు బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, మాజీ ఎమ్మెల్యేలు అన్నాబత్తుని శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సమన్వయకర్తలు అంబటి మురళి (పొన్నూరు), షేక్ నూరి ఫాతిమా(గుంటూరు తూర్పు), ఎలికా శ్రీకాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి, వేదికపై ఎంపీ అయోధ్యరామిరెడ్డి, మాజీ మంత్రులు అంబటి, రజని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

నూతన భవన సముదాయానికి రూ 6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న వసతి భవన సముదాయంలో ఒక గదికి అయ్యే ఖర్చు రూ. 6 లక్షలను నగరానికి చెందిన పర్వతనేని వెంకట లక్ష్మీ, పర్వతనేని నాగ మోహన సాయి విరాళంగా ప్రకటించారు.


సామినేని, చుక్కపల్లి రమేష్‌లకు చెక్కును అందజేస్తున్న దాతలు

శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు వారు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, పాల కవర్గ సభ్యులు పెద్ది సాంబశివరావు, వాసిరెడ్డి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.


ఆందోళన చేపట్టిన వ్యక్తితో వాదులాడుతున్న దుకాణ మద్దతుదారుడు

మా ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు

ఆందోళనకు దిగిన స్థానికులు

వేటపాలెం (చీరాల), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మా ఇళ్ల మధ్య మద్యం దుకాణం వద్దు.. కావాలంటే మీ ఇళ్ల మధ్య పెట్టుకోండని పలువురు రోడ్డెక్కారు. చీరాల, ఒంగోలు మెయిన్ రోడ్డులో దంత వైద్యశాల ఎదురు శనివారం ఈ ఘటన జరిగింది. అక్కడ ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణాన్ని స్థానికులు వ్యతిరేకించారు. పలువురు మహిళలు, పురుషులు తమ అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో దుకాణ మద్దతుదారులు, ఆందోళన చేపట్టిన వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో మద్యం దుకాణ మద్దతుదారులు కొందరు వారిపట్ల ఒకింత అనుచితంగా ప్రవర్తించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. అనంతరం మద్యం దుకాణాన్ని వ్యతిరేకించిన వారు ఆర్డీవో చంద్రశేఖరనాయుడుని కలసి తమ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దని అర్జీ అందజేశారు.

రైలు ప్రమాదంలో వృద్ధుడి మృతి



చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని సుమారు 75 సంవత్సరాల వృద్ధుడు మృతి చెందారు. ఈఘటన కారంచేడు రైలు గేటు సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. వృద్ధుడు పట్టాలు దాటుతుండగా విజయవాడ - గూడూరు మెమో రైలు ఢీకొన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి, మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వెనుక నుంచి కారు ఢీ

టైలర్‌కు తీవ్ర గాయాలు

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అకస్మాత్తుగా కారు టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి టైలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన చీరాల-పాపాయిపాలెం రోడ్డులోని ప్రైవేటు కళాశాల సమీపంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయిపాలెంకు చెందిన బొమ్మిడి అచ్చయ్య గ్రామంలోనే టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే శనివారం ద్విచక్ర వాహనంపై చీరాలకు వెళుతుండగా వెనుక నుండి వస్తున్న కారుకు ముందు చక్రం పంచర్ పడింది. దీంతో అదుపుతప్పి వేగంగా టైలర్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర రక్తస్రావం కావడంతో చీరాలలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కోలలపూడి క్రాస్ రోడ్డు ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వాహనదారులు గాయపడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. గాయపడిన ఇద్దరు యువకులను టోల్ ప్లాజాకు చెందిన అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. గుంటూరులోని శివ నాగరాజుకాలనీకి చెందిన పరిసపోగు దిలీప్ స్కూటీపై ఒంగోలు వైపు టోల్ ప్లాజా వైపు నుంచి మార్టూరు వైపు వస్తున్నారు. ఇదే రోడ్డులో ఉన్న పొగాకు గౌడౌన్‌లో పనిచేస్తున్న జె.పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామానికి చెందిన పత్తిపోగు పవన్ కల్యాణ్ ద్విచక్రవాహనంపై రాత్రి ఇంటికి రాంగ్‌రూట్‌లో వెళుతూ స్కూటీపై వస్తున్న దిలీప్‌ను ఢీకొన్నాడు. దాంతో వారిద్దరూ గాయాలతో రోడ్డుపై పడి పోయారు. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తర్వాత గాయపడిన వారిద్దరినీ అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత వారిద్దరిని మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

అన్న ఎదుటే తమ్ముడి ఆత్మహత్య

- మోటార్‌సైకిల్‌పై బయలుదేరిన అన్నదమ్ములు
- డబ్బులు కింద పడ్డాయని చెప్పడంతో ఆపిన వైనం
- గుండ్లకమ్మ నదిలోకి దూకిన తమ్ముడు


దుర్గాప్రసాద్

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అన్నదమ్ములు కలిసి మోటార్‌సైకిల్‌పై తిమ్మాయపాలెం వెళ్తున్నామని ఇంటి దగ్గర చెప్పి వెళ్లారు. కొద్దిసేపటికే తమ్ముడు చనిపోయాడని ఇంటికి ఫోన్ వచ్చింది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీ 19వ లైన్‌లో నివాసముండే దాట్ల శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్ (18) విశ్వభారతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం అన్నదమ్ములిద్దరూ మోటార్‌సైకిల్‌పై తిమ్మాయపాలెం వెళ్తున్నారు. గుండ్లకమ్మ నది బ్రిడ్జిపైకి వెళ్లిన సమయంలో డబ్బులు కిందపడ్డాయి మోటార్‌సైకిల్ ఆపమని దుర్గా ప్రసాద్ చెప్పాడు. దీంతో మోటార్‌సైకిల్‌ను అన్న ఆపుతున్న సమయంలో దుర్గా ప్రసాద్ ఒక్కసారిగా మోటార్‌సైకిల్‌పై నుంచి దిగి పరుగెత్తుకుంటూ వెళ్లి బ్రిడ్జిపై నుంచే గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఎగువ భాగంలో దూకాడు. అన్న కేకలు వేసినప్పటికీ నదిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కాపాడే అవకాశం లేకుండా పోయింది. తన కళ్ల ఎదుటే తమ్ముడు గుండ్లకమ్మ నీటిలో మునిగిపోయాడు. విషయాన్ని వెంటనే ఇంటికి ఫోన్ చేసి చెప్పాడు. గజ ఈతగాళ్లు గాలించినప్పటికి ఆచూకీ లభించలేదు. నర్రావారిపాలెం రేవు దాటి వెళ్లినట్లు భావిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చినప్పటికీ అప్పటికే చీకటి పడడంతో ఆదివారం ఉదయం మృతదేహం కోసం గాలిస్తామని చెప్పారు. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతి కి కారణాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనా స్థలాన్ని సీఐ కృష్ణయ్య, ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించారు.

కొడుకా ఎక్కడున్నావయ్యా!

- ఒడిసా బాలుడి అదృశ్యం
- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- బతుకుదెరువుకు పది రోజుల కిందట చీరాలకు


మొళాయ్

కావూరివారిపాలెం(చీరాలటౌన్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బతుకుదెరువుకు వచ్చాం.. మా బిడ్డ జాడ చెప్పి ఆదుకోండని ఒడిసాకు చెందిన తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే చీరాల మండలం కావూరివారిపాలెంలో ఉన్న రాయల్ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీలో పని చేసుకుని జీవనాన్ని గడిపేందుకు సుమారు పది రోజుల క్రితం మనోజ్ నాయక్, జున్ను దంపతులు కావూరివారిపాలెం ఆంధ్రకేసరినగర్‌కు వచ్చారు. వీరికి ఒడియా భాష తప్ప తెలుగు రాదు. శుక్రవారం మధ్యాహ్నం వీరి కుమారుడు మొళాయ్ నాయక్(12) అదృశ్యమయ్యాడు. దీంతో వచ్చీరాని భాషలోనే ప్రతి వీధిలోనూ వెదికారు. ఎక్కిఎక్కి ఏడ్చారు. చేసేదిలేక ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ శివకుమార్ గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్సై కోరారు. అయితే బిడ్డ జాడ తెలియక తల్లిదండ్రులు బోరుమంటున్న సంఘటన అందరి కళ్లను చెమర్చాయి.


వేడుకుంటున్న మొళాయ్ తల్లిదండ్రులు

ఇసుక అక్రమ తవ్వకాలపై కదిలిన యంత్రాంగం

- అధికారుల్లో వీడని సందిగ్ధత
- బాపట్ల, అద్దంకి నుంచి కూడా చీరాల నియోజకవర్గానికి
- సీఎం చంద్రబాబు చెప్పారు కదా అంటున్న ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేటపాలలెం(చీరాల), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో అధికార యంత్రాంగం కదిలింది. శనివారం తహసీల్దార్ పార్వతి, మైనింగ్ ఆర్ఐ రాజేంద్రప్రసాద్, ఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ఐ శ్రీకాంత్‌ల బృందం ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి దాడులు నిర్వహించారు. ఆ క్రమంలో తోటల్లో ఉన్న ఎక్స్‌కవేటర్‌ను గుర్తించారు. అధికారుల బృందాన్ని చూచి ఎక్స్‌కవేటర్ డ్రైవర్ పరారయ్యాడు. అక్కడ నుంచి సమీపంలో ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని అధికారుల బృందం పరిశీలించింది. ఆ క్రమంలో విధి నిర్వహణలో ఉన్న తనతో వాదన పెట్టుకున్న అశోక్, ఎక్స్‌కవేటర్‌కు సంబంధించి ప్రసాద్ అనే వ్యక్తి, తవ్వకాలు జరిగిన ప్రదేశానికి సంబంధించి రామారావు, భిక్షవతికి నోటీసులు ఇచ్చి, ఎక్స్‌కేటర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి సంబంధీకులపై తగిన చర్యలు చేపట్టే విధంగా పోలీసు వారికి చెప్పినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు.


అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు

సీఎం ట్రాక్టర్లతో తోలుకోవచ్చన్నారుగదా

సీఎం చంద్రబాబు ఇసుకను ట్రాక్టర్లతో ఉచిత ఇసుక విధానంలో తోలుకోవచ్చని చెప్పారు గదా, మమ్మల్ని ఎందుకు ఆపుతున్నారని ఇసుక తవ్వకాలు, రవాణా చేసే వ్యక్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. పదుల సంఖ్యలో క్వారీలను ఏర్పాటు చేసుకుని తవ్వకాలు, రవాణా జరుపుతున్న వారిని వదిలేసి కేవలం మమ్మల్నే ఎందుకు ఆపుతున్నారని, మిగిలిన వారిని ఎందుకు ఆపరని పట్టుబడినారు అధికారులను ప్రశ్నించడం వారికి తలనొప్పిగా మారుతోంది. అయితే సీఎం చంద్రబాబు వాగులు, వంకలు, నదులు ఉన్న ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల లోపు సొంత అవసరాలకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తోలుకోమన్నారన్న విషయాన్ని అధికారులు పదే పదే చెప్పాల్సి వస్తోంది. కొందరు ఎందుకు తలనొప్పని అక్రమ తవ్వకాలు, రవాణాను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు.

అద్దంకి, బాపట్ల ప్రాంతాల నుంచి

చీరాల నియోజకవర్గంలో ఇసుక భూములు ఎక్కువగా ఉండడం, పెద్ద ఎత్తున ఎక్స్‌కవేటర్లతో క్వారీలలో తవ్వకాలు సాగిస్తుండడంతో పాటు ధర తక్కువగా ఉండడంతో అద్దంకి, బాపట్ల ప్రాంతాల నుంచి ఇసుక కోసం చీరాల నియోజకవర్గానికి వస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక ధర రూ.4,500 ఉంటే ప్రస్తుతం దూరాన్ని బట్టి రూ.1800 నుంచి రూ.4వేల మధ్య తోలుతున్నారు.


ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేస్తున్న తహసీల్దార్ పార్వతి, ఎస్సై వెంకటేశ్వర్లు

అధికారుల్లో వీడని సందిగ్ధత

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాకు సంబంధించి అధికారులు కూడా కొంత సందిగ్ధంలో ఉన్నారని విషయం తెలిసిన వారు చెప్తున్నారు. ట్రాక్టరు యజమానులు, డ్రైవర్లు సీఎం చంద్రబాబు చెప్పారు, మీరెందుకు ఆపుతున్నారనే కోణంలో ప్రశ్నించడంతో, కేసులు కట్టేందుకు కూడా ఒకింత వెనకడుగు వేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారులు వాస్తవ పరిస్థితులను, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన అంశాలకు సంబంధించి స్పష్టమైన ప్రకటన చేసి స్థానిక అధికారులకు దిశానిర్దేశం చేయాల్సిన అవసరం ఉంది.

అండర్ పాస్‌లో పోయే ఇళ్ల పరిశీలన

- బాధితుల సమస్యలు తెలుసుకున్న ఆర్డీవో


తిమ్మనపాలెం ఎస్సీ కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

మేదరమెట్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిలో తిమ్మనపాలెం చెక్ పోస్టు వద్ద నూతనంగా నిర్మిస్తున్న అండర్ పాస్ నిర్మాణంలో కోల్పోయే ఇళ్లను చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడారు. శనివారం మండలంలోని తిమ్మనపాలెం గ్రామానికి వచ్చిన ఆయన కొత్తగా నిర్మించే ఫ్లైవోవర్, సర్వీస్ రోడ్డు కోసం భూ సేకరణ ప్రాంతాన్ని తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ఎస్సీ కాలనీ వాసులు మాట్లాడుతూ 70వ దశకంలో ప్రభుత్వం మాకు ఇచ్చిన ఇంటి స్థలాలలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నామన్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిన ఈ సమయంలో తమ ఇళ్లను రోడ్డు నిర్మాణం కోసం తీసుకోవడం అన్యాయమన్నారు. చాలా తక్కువ నష్ట పరిహారం ఇచ్చి భూములను స్వాధీనం చేసుకోవడం కూడా న్యాయం కాదన్నారు. తమకు ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించి నివాస యోగ్యమైన స్థలాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే స్థలాలు కేటాయించాలని ఆర్డీవోకు విన్నవించారు. కాలనీ వాసుల సమస్యలు విన్న ఆర్డీవో మీ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఆర్ఐ కృష్ణమోహన్, సర్వేయర్ మహేష్ బాబు, వీఆర్వో సుధాకర్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వర్మకు ఘనస్వాగతం

- తెలుగు అసోసియేషన్ కృషికి అభినందనలు
- అక్కడి మంత్రి, ఎంపీలతో భేటీ


న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యే ఏలూరిని సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్ర వర్మకు న్యూజిలాండ్‌లోని మన ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన అసోసియేషన్ సభకు ఎమ్మెల్యేలను మంగళ వాయిద్యాలతో తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ న్యూజిలాండ్‌లో సైతం తెలుగువారు సంస్కృతి సంప్రదాయాలను కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఆంధ్ర అసోసియేషన్ తెలుగువారి కోసం చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఎక్కడ ఉన్నా తెలుగు ప్రజలు ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యేలను దుశ్శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం న్యూజిలాండ్ మంత్రి మిచెల్ ఉడ్, న్యూజిల్యాండ్ పార్లమెంట్ సభ్యుడు కార్లోస్ చియంగ్‌తో ఏలూరి, వర్మ భేటీ అయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం తెలుగు అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మద్దుకూరి దిలీప్ పాల్గొన్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న పురుగు మందు డబ్బాలు

ధరల్లో మాయ!

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందుల విక్రయాల్లో ధరల మాయాజాలం సాగుతోంది. ఒకే కంపెనీకి చెందిన మందును ఒక్కో చోట ఒక్కో ధరకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి మందు డబ్బాపై ఎంఆర్‌పీ (గరిష్ట చిల్లర ధర) ఒకటి ఉండగా, విక్రయించే ధర అంతకన్నా తక్కువ ఉంటుంది. ఈ క్రమంలో ఒక్కో చోట ఒక్కో విధంగా దుకాణదారులు విక్రయిస్తున్నారు. బేరమాడి కొనుగోలు చేయడం లేదా డబ్బు చెల్లించి కొనుగోలు చేయడమైతే ఒక ధర, అరువు మీద తీసుకుంటే మరో ధరకు విక్రయిస్తున్నారు. దీంతో ఇన్‌వాయిస్ ధర ఎంత? నిర్దిష్టంగా ఎంతకు విక్రయించాలనే విషయమై స్పష్టత లేదని రైతులు చెప్తున్నారు. వాస్తవానికి ఎంఆర్‌పీ ధరపై తయారీదారులు టాక్స్ చెల్లిస్తుంటారు. కానీ ఎంఆర్‌పీ కన్నా తక్కువకు విక్రయిస్తుంటారు. అది ఇన్‌వాయిస్ ధర అని చెప్తూ బిల్లు ఇస్తుంటారు. అయితే అన్ని ప్రాంతాల్లో ఆయా ధరలు ఎంత తక్కువకు విక్రయించగలిగితే అంత తక్కువకు ఇచ్చేలా వ్యవసాయశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాకు అవగాహన లేదు.. టెక్నికల్ వాళ్లను కనుక్కుని చెప్తాను

పురుగు మందులు ఎమ్మార్పీ కన్నా తక్కువకు విక్రయిస్తుంటారు. కానీ ఇన్‌వాయిస్ ధర ప్రకారం వారు బిల్లులు రాసి, విక్రయిస్తుంటారు. ఎంఆర్‌పీ కన్నా తక్కువకు ఎలా, ఎందుకు విక్రయిస్తుంటారో నాకు తెలియదు. టెక్నికల్ వాళ్లను కనుక్కొని చెప్తాను. రైతులు ఇబ్బంది పడకుండా, నష్టపోకుండా చర్యలు తీసుకుంటాం.

\- సుమతి, ఏవో, చీరాల మండలం

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ వారు ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, గుండె స్కానింగ్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియో గ్రామ్ పరీక్ష చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.


హనుమాన్ మండల దీక్ష తీసుకుంటున్న భక్తులు

శింగరకొండలో హనుమాన్ మండల దీక్ష తీసుకున్న భక్తులు

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, దర్శి, పొదిలి, కందుకూరు, టంగుటూరు, రాజుపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 మందికిపైగా భక్తులు శనివారం హనుమాన్ మండల దీక్ష తీసుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం హనుమాన్ మండల దీక్ష తీసుకున్నారు. కార్తీక మాసం మొదటి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. సుమారు వెయ్యి మంది భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం 22వ తేదీన అర్ధమండల దీక్ష ప్రారంభమవుతుందని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. డిసెంబరు 13వ తేదీ హనుమత్ వ్రతం సందర్భంగా దీక్ష విరమణ ఉంటుందన్నారు. డిసెంబరు 13న ఉదయం 7 గంటలకు దీక్షధారుల ఆలయ ప్రదక్షిణ, 7-30 గంటలకు భక్తులు సమర్పించిన ఇరుముడి ద్రవ్యాలతో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి అనంతరం మాల విరమణ జరుగుతుందని తెలిపారు.

దీక్షధారులకు అన్నదానం ప్రారంభం

చినగంజాం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానంలో దీక్షధారులకు అన్నదాన (సద్ది) కార్యక్రమాన్ని దేవస్థాన కమిటీ చైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు దంపతులు శనివారం ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలోని హరిహర సుత అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు, గురుస్వాములు నరహరి హనుమంతరావు, చెరుకూరి రాఘవయ్య ఆధ్వర్యంలో స్వామి వారికి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అయ్యప్ప శివ, భవానీ, ఆంజనేయ, వేంకటేశ్వర తదితర దీక్షధారులకు 2025 జనవరి 10వ తేదీ వరకు సద్ది కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హెచ్ఆర్‌సీఐ జాతీయ అధ్యక్షుడు శ్రీకాంత్

అవినీతి రహిత సమాజమే లక్ష్యం

విశ్రాంత సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డేవిడ్

పర్చూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజమే లక్ష్యంగా యువత ముందుకు సాగాలని విశ్రాంత సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్కిపోగు డేవిడ్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం పర్చూరులో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా (హెచ్ఆర్‌సీఐ) బాపట్ల జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి డేవిడ్‌ను, బాపట్ల జిల్లా అధ్యక్షునిగా నియమితులైన లక్కిపోగు సుమన్‌ను జాతీయ అధ్యక్షుడు చెన్నుపాటి శ్రీకాంత్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. తొలుత నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఎక్కడ అవినీతి జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని జాతీయ అధ్యక్షుడు కోరారు. కార్యక్రమంలో కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి నందం నరసింహారావు, ఏపీ అధ్యక్షుడు జెర్రిపోతుల నానాజీ, ఉపాధ్యక్షుడు జి.రాంబాబు, సౌత్ ఇండియా మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి, లీగల్ కార్యదర్శి రాజ్యలక్ష్మి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, మక్కెన శేఖర్‌బాబు, షేక్ షంషుద్దీన్, అగ్నిగుండాల వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరం రౌడీషీటర్లకు శనివారం సంతమాగులూరు సర్కిల్ కార్యాలయంలో సీఐ కె.వెంకట్రావు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి అలజడులు సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో వేమవరం గ్రామంలో జంట హత్యలు జరిగాయని మరలా అలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎవరు ఏమి చేస్తున్నారో తమ వద్ద పూర్తి సమాచారం ఉందని, చట్టాన్ని ఉల్లంఘిస్తే నాన్‌బెయిల్‌బుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామం విడిచి ఎవరైనా వెళ్లాలంటే పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలని వారికి సూచించారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

అద్దంకిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, 2030 నాటికి దానిని పూర్తి స్థాయిలో నిర్మూలించాలనే లక్ష్యంతో అందరు కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. శనివారం గురుకుల పాఠశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి సమాజ సేవలో భాగస్వాములు కావాలని ప్రిన్సిపాల్ గాయత్రిదేవి అన్నారు. కార్యక్రమంలో అద్దంకి, మార్టూరు, కొరిశపాడు, నాగులుప్పలపాడు, అవుట్రీచ్ వర్కర్స్ దుర్గా, మల్లేశ్వరి, కృష్ణవేణి, కరుణ, శ్రావణి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రీ-సర్వే చేయాలి

అద్దంకి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో ఆస్తులను పకడ్బందీగా రీ-సర్వే చేయాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. రీసర్వే నిర్వహణపై శనివారం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ, అడ్మిన్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీలకు రీసర్వే ఓరియాంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ అద్దంకి పట్టణ పరిధిలో ఆస్తులను సోమవారం నుంచి రీసర్వే ప్రారంభిస్తామన్నారు. గతం లో నిర్వహించిన సర్వేలో ఏవైనా లోపాలు చోటు చేసుకొని ఉంటే సరిచేసుకునే అవకాశం ఉంటుందన్నారు. మేనేజర్ శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లపల్లి పీహెచ్‌సీ నిర్మాణంపై కసరత్తు

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఓఎస్‌డీ నక్కల రమణారావు పందిళ్లపల్లి పీహెచ్‌సీ నూతన భవన నిర్మాణానికి సంబంధించి డీఎంహెచ్‌వోతో మాట్లాడారు. అందుకు సంబంధించి డీఎంహెచ్‌వో విజయమ్మకు పరిణామాలను వివరిస్తూ, పీహెచ్‌సీ నిర్మాణ ఆవశ్యకతను తెలుపుతూ రాతపూర్వక నివేదికను అందజేశారు. త్వరలో తదుపరి కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

రిలే నిరాహార దీక్ష

పందిళ్లపల్లి పీహెచ్‌సీ భవన నిర్మాణం యుద్ధప్రాతిపదికన చేపట్టాలని కోరుతూ చెరుకూరి రాంబాబు అనే వ్యక్తి శనివారం పీహెచ్‌సీ వద్ద రిలే నిరాహార దీక్షకు కూర్చున్నారు. పీహెచ్‌సీ భవన నిర్మాణం వెంటనే జరిగేలా తాను దీక్ష చేపట్టినట్లు తెలిపారు.

గృహ నిర్మాణాలపై అధికారుల పరిశీలన

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని చీరాల-1 లేఅవుట్‌ను జిల్లా హౌసింగ్ అధికారి ఎమినేని వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈక్రమంలో నిర్మాణాలపై ఆరా తీశారు. పూర్తి కాని నిర్మాణాలకు సంబంధించి యజమానులతో మాట్లాడాలని సూచించారు. మార్చి 25 నాటికి నూతన హౌసింగ్ విధానం అమలులోకి వస్తుందని వెంటనే పాతవి పూర్తి చేయాలని సూచించారు. అలాగే సచివాలయ పరిధిలోని ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక దృష్టి సారించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ గాజుల శ్రీనివాసరావు ఏఈలు శ్రీనివాసరావు, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.


లేఅవుట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ జిల్లా అధికారి వెంకటేశ్వరరావు

బల్లికురవ మండలానికి 50 ట్రాన్స్‌ఫార్మర్లు

» మంత్రి గొట్టిపాటి ఆదేశంతో మంజూరు

» రైతుల కృతజ్ఞతలు



బల్లికురవ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద పంపిణీకి సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పంటలకు రైతులు విద్యుత్ లైన్ల కోసం గతంలో దరఖాస్తులు ఇచ్చి ఏళ్లుగా కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. రైతుల ఇబ్బందులను తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెంటనే వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేయాలని ఆదేశాలిచ్చారు. ఈమేరకు బల్లికురవ మండలానికి 50 నూతన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు శనివారం వచ్చాయి. మెత్తం 180 మంది రైతుల దరఖాస్తులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం ప్రత్యేక మేళా పెట్టి రైతులకు ఒకే సారి ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందజేస్తామని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. వైదనకు 10, వెలమవారిపాలెంకు 9, ఎస్ఎల్‌గుడిపాడుకు 5, కొమ్మినేనివారిపాలెం 4, కొణిదెన 3, ముక్తేశ్వరం 2, చెన్నుపల్లి 3, మరి కొన్ని గ్రామాలకు 6, దొంగతనాలకు గురైన 8 ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందజేస్తామని రైతులు విద్యుత్ శాఖ కార్యాలయానికి రావాలని ఏఈ కోరారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఒకే మారు పెద్ద సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్ల పంపిణీకి అధికారులు సిద్ధం చేస్తున్నారు. మంత్రి గొట్టిపాటికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ఊరూరా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

» లబ్ధిదారుల కళ్లల్లో వెలుగులు

» వినియోగదారుల ఖాతాల్లోకి నగదు జమ



పంపిణీలో ఉచిత గ్యాస్ సిలిండర్ల వాహనం

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు అంటే మాకు నమ్మకం. డ్వాక్రా గ్రూపుల ఏర్పాటుతో మహిళా సాధికారత తెచ్చారు. గతంలో దీపం పథకం పెట్టారు. ఇప్పుడు దీపం-2 పథకం ద్వారా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నారు. వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమవుతుంది. దీపావళి పండుగ కానుకగా మాకు అందించిన కానుకను మర్చిపోలేమని ఉచిత సిలిండర్లు అందుకుంటున్న లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా మహిళల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జిల్లా పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో డీఎస్‌వో విలియమ్స్ పర్యవేక్షణలో ఈపురుపాలెంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ఉచిత గ్యాస్ సిలిండర్లను పొందిన లబ్ధిదారులలో పలువురిని శనివారం ఆంధ్రజ్యోతి పలకరించగా వారు ఆనందం వ్యక్తం చేశారు. కుటుంబ నిర్వహణలో గ్యాస్ ఖర్చు ఒక రకంగా తమకు తలకుమించిన భారంగా ఉందని, ఉచిత సిలిండర్లతో ఆ భారం ఎంతో తగ్గుతుందని చెప్పారు.

మహిళలకు దీపం-2 వరం



దీపం-2 పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇవ్వడం మహిళలకు వరం. కుటుంబ నిర్వహణలో మహిళల పాత్ర కీలకం. పొదుపులో ముందుంటాం. ఆ క్రమంలో ఉచిత సిలిండర్లు ఇవ్వడంతో ఆదా అయిన డబ్బులను పొదుపు చేసుకోవడం ద్వారా మెరుగైన జీవనశైలికి మార్గం అవుతుంది. సూపర్ సిక్స్ పథకాలకు మహిళలకు మేలు చేకూరుతుంది.

- జి.కాంచన, లబ్ధిదారురాలు, ఈపురుపాలెం



అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

నిరుపేదలకు సంక్షేమ పథకాలు చేరాలి

ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలో వెనుకబడిన, గుర్తింపు పొందని వారి వివరాలను వేగవంతంగా సేకరించి సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం అన్నారు. మండల కార్యాలయంలో శనివారం సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యంతో పాటు సంక్షేమాలు పారదర్శకంగా అందించాలన్నారు. మండల పరిధిలో ఆధార్, ఓటరు, రేషన్ కార్డులు, వివిధ గుర్తింపులేని వెనుకబడిన తరుగతుల వారి వివరాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ రామకృష్ణ, పంచాయతీల సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి కుటుంబ సర్వే : ఎంపీడీవో సింగయ్య

అద్దంకిటౌన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాలలో వెనుకబడిన బీసీ-ఏ కులాలైన 32 కులాల కుటుంబాలకు ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు సర్వే చేయనున్నట్లు ఎంపీడీవో బత్తిని సింగయ్య శనివారం ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కులాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. 32 కులాల కుటుంబాలు సర్వే సిబ్బందికి సహకరించాలని ఎంపీడీవో కోరారు.

మండలంలో 99 శాతం పింఛన్‌ల పంపిణీ

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో శుక్ర, శనివారాలలో సామాజిక పింఛన్‌లు 99 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కె.స్వరూపారాణి తెలిపారు. 14 సచివాలయాల పరిధిలో మొత్తం 7,890 మంది పింఛన్‌దారులు ఉండగా, గ్రామాలలో అందుబాటులో ఉన్న 7,784 మందికి అందచేశామన్నారు. మిగిలిన 106 పింఛన్‌దారులలో 32 మంది చనిపోయారని, మిగిలిన 74 మందికి అందచేయాల్సి ఉందన్నారు. సకాలంలో పంపిణీ చేసిన సిబ్బందిని అభినందించారు.

మహిళలకు కుట్టుపై శిక్షణ

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : అమ్మ ఆశ్రమంలో ఈ నెల 4వ తేదీ సోమవారం నుంచి మహిళలకు స్కూల్ యూనిఫామ్స్ కుట్టుపై శిక్షణ ఇస్తున్నట్లు ఆశ్రమం అధ్యక్షుడు గుంటుపల్లి చందు శనివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఆశ్రమంలో సంప్రదించాలని కోరారు.

జనసేన పార్టీ నాయకుల అన్నదానం

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ నాయకులు డొక్కా సీతమ్మ పేరుమీద శనివారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. ఎన్ఆర్ఐ మన్నె శ్రీకాంత్ ఆర్థిక సహకారంతో మండల నాయకులు మందపాటి కిషోర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మార్టూరులోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ కంటి వైద్యుడు కొర్రపాటి సుబ్రమణ్యం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, మాదాల సాంబ శివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రోణాదులలో సీఐ పల్లెనిద్ర

మార్టూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో శుక్రవారం రాత్రి సీఐ ఎం.శేషగిరిరావు పల్లెనిద్ర కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామాలలో శాంతియుత వాతావరణం కనిపించాలన్నారు. సమాజంలో అందరూ భాగస్వామ్యులుగా కలిసి పనిచేయాలన్నారు. తద్వారా భావితరాలవారికి మనం ఆదర్శంగా నిలుస్తామన్నారు. అనంతరం ఆయన గ్రామంలోని ప్రధాన వీధులలో సిబ్బందితో కలిసి పరిశీలించారు.

మద్యం మత్తులో మహిళలపై దాడులు



మాట్లాడుతున్న రమాదేవి

చీరాలటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో మద్యం మత్తులో మహిళలపై దాడులు పేట్రేగిపోతున్నాయని వీటిని అరికట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమాదేవి పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ భవన్‌లో ప్రాంతీయ సభలో ఆమె మాట్లాడారు. మద్యం నియంత్రణపై ప్రభుత్వం దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.బాబూరావు, కిరణ్, సత్యమూర్తి, అయ్యప్పరెడ్డి, వసంతరావు, ఎల్.జయరాజ్, కొండయ్య, నారపరెడ్డి, హరిప్రసాద్ పాల్గొన్నారు.



వాడరేవు రోడ్డులో ప్రభుత్వ స్థలానికి దూరంగా వేసిన స్తంభాలు

విద్యుత్ స్తంభాల ఏర్పాటులో మాయాజాలం

ప్రభుత్వ స్థలం కబ్జా అయ్యే ప్రమాదం?

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కొత్తపేట నుంచి వాడరేవుకు వెళ్లే దారిలో 216 జాతీయ రహదారి పక్కన నూతనంగా వేసిన విద్యుత్ స్తంభాలతో ప్రభుత్వ భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనిపై స్థానికుల్లో చర్చ నడుస్తోంది. హాయ్ రెస్టారెంట్ ఎదురు వాడరేవు రోడ్డుకు ఒక వైపు స్థలం వ్యక్తుల దరఖాస్తు మేరకు నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల స్థలానికి ప్రస్తుతం కరెంట్ పోల్స్ వేసిన ప్రదేశానికి మధ్య ప్రభుత్వ స్థలం ఉంది. ఆ రెండు స్థలాలకు హద్దు వద్ద స్ట్రయిట్‌లైన్ వేయాల్సి ఉండగా, మధ్యలో ప్రభుత్వ స్థలాన్ని వదిలి ఉద్దేశపూర్వకంగా ఇవతల స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విధంగా కరెంట్ స్తంభాలను వేస్తే అవతల ఉన్న ప్రయివేటు వ్యక్తులు మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రమాదం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్థలం ఎంత వరకు ఉందో ఆ హద్దులో స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దీనిపై సదరు కాంట్రాక్టరు, అధికారులను వివరణ కోరగా.. వాస్తవానికి స్ట్రయిట్ లైన్ ఉంటేనే విద్యుత్ లైన్ బలంగా ఉంటుందన్నారు. మరోసారి పరిశీలించి అవసరమైతే వేసిన స్తంభాలను మారుస్తామని చెప్పారు. విలువైన ప్రభుత్వ భూమి పరుల పరం అవుతుందనే స్థానికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని తగిన చర్యలు చేపడతామని వారు స్పష్టం చేశారు.

చిప్ డిజైనింగ్‌పై ముగిసిన వర్క్‌షాప్



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగంలో 2వ సంవత్సరం విద్యార్థులకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి సహకారంతో చిప్ డిజైనింగ్‌లో నిర్వహించిన వర్క్‌షాప్ శనివారంతో ముగిసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీష్‌బాబు మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధి ఉమామహేశ్వరరావు, రాఘవస్వామి, సాయి సందీప్, ఎస్.రవీంద్ర, జీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లు బాగు

» యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు ప్రారంభం



రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఆర్అండ్‌బీ డీఈ నళిని

చీరాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎట్ట కేలకు రోడ్లు బాగుపడుతున్నాయి. గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పిలుపునిచ్చింది. శనివారం ఆర్అండ్‌బీ డీఈ ఎం.నళిని ఎక్స్‌కవేటర్‌కు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు గంజిపాలెం నుంచి రామాపురం వరకు రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈ నళిని మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దిశానిర్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రోడ్ల మరమ్మత్తుల పనుల్లో భాగంగా చీరాలలో కూడా పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్, కాంట్రాక్టరు సత్యనారాయణ, నాయకులు కౌతవరపు జనార్దనరావు, రమేష్, గంజి పురుషోత్తమ్, తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, రాము, మురళి, శంభుప్రసాద్, పఠాన్ గౌస్, హరికృష్ణ, మస్తాన్ రావు పాల్గొన్నారు.

గుంతలు లేని రహదారులే లక్ష్యం

చినగంజాం : గుంతలు లేని రోడ్ల నిర్మాణమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టీడీపీ చినగంజాం, ఇంకొల్లు మండల అధ్యక్షులు పొద వీరయ్య, నాయుడు హనుమంతరావులు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు సంతరావూరులో శనివారం పనులు ప్రారంభించారు. సంతరావూరు నుంచి ఇంకొల్లు ఆర్అండ్‌బీ రోడుకు ప్యాచ్ వర్క్ పనులకు టీడీపీ నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు భూమి పూజ కార్యక్రమం నిర్వహించి, పనులు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌రెడ్డి పాలనతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారిందని వీరయ్య, హనుమంతరావు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే రోడ్లకు మహర్దశ పట్టిందన్నారు. ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో ఇప్పటికే పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా కోట్లాది రూపాయిలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. సంక్రాంతి నాటికి గుంతలు లేని సిమెంట్ రోడ్ల నిర్మాణమే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చీరాల ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ డీఈ నళిని, ఏఈ శ్రీకాంత్, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు యార్లగడ్డ లక్ష్మి, టీడీపీ ఇంకొల్లు పట్టణ అధ్యక్షుడు మార్క్, నాయకులు దేవతోటి నాగరాజు, వెంకటేశ్వర్లు, సురేష్, వెంకటరావు, తూమాటి శ్రీను, రాజేష్, కర్రి శ్రీను, సునీల్, వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, టీడీపీ నాయకులు

ఇంకొల్లు : గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఇంకొల్లు నుంచి సంతరావూరు ఆర్అండ్‌బీ రోడ్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఈ రహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ.15 లక్షలు నిధులు మంజూరు చేసిందని ఆర్అండ్‌బీ జేఈ శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల పార్టీ అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు, చిన్నగంజాం మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య, కరి శ్రీనివాసరావు, వలేరు మార్క్, గుంజి వెంకట్రావు, టీడీపీ నాయకులు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లకు దెబ్బ

» అవగాహన లేక ఇనుప చక్రాలతో తిప్పుతున్న రైతులు

» సాగు పనులు ముమ్మరం కావడంతో జోరుగా తిరుగుతున్న వాహనాలు

» పట్టించుకోని అధికారులు



బల్లికురవ అద్దంకి అర్అండ్‌బీ రోడ్డుపై వెళ్తున్న దమ్ము చక్రాల ట్రాక్టర్

బల్లికురవ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దమ్ము చక్రాల ట్రాక్టర్లతో కోట్ల రుపాయలతో చేపట్టిన రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. రైతులకు అవగాహన లేకనే వారు రోడ్లపైకి ఇనుప చక్రాలను తీసుకు వస్తున్నారు. అధికారులు రైతులకు సూచనలు చేయడంతో పాటు చక్రాలకు రబ్బరు తొడుగులను అందజేయాలని ప్రజలు కోరుతున్నారు. వరి పంట సాగు సీజన్ ప్రారంభం కావడంతో దమ్ము చక్రాల ట్రాక్టర్ల రైతులకు అవగాహన కలిపించాలని వారు అంటున్నారు.

బల్లికురవ మండలంలో వరి పంటను రైతులు అధికంగా సాగు చేస్తుంటారు. వరి పంట వేయాలంటే పొలం దమ్ము చేసేందుకు ఇనుప చక్రాల ట్రాక్టర్లు అవసరం. ఏటా గ్రామాలలోని రోడ్ల పైకి ఇనుప చక్రాల ట్రాక్టర్లు రావడంతో రోడ్లపై గుంతలతో గాడులు పడి వర్షాలు కురవగానే అవి పాడయిపోతున్నాయి. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కొత్తూరు, వెలమవారిపాలెం, ముక్తేశ్వరం, వల్లాపల్లి, చెన్నుపల్లి, కొప్పెరపాలెం, కూకట్లపల్లి గ్రామాల పరిధిలో ఎక్కువ మంది రైతులు వరి పంటను సాగు చేసి దమ్ము చక్రాల ట్రాక్టర్లను వాడుతుంటారు. అయా గ్రామాలలో తారు రోడ్లు, సీసీ రోడ్లు దమ్ము చక్రాల వల్ల పూర్తిగా దెబ్బతింటున్నాయి. గ్రామాలలో సీసీ రోడ్లపై దమ్ము చక్రాల ట్రాక్టర్లు పొలానికి వెళ్లివచ్చు క్రమంలో రోజుకు పలు మార్లు తిరగడం వలన సిమెంట్ రోడ్డు గుల్ల అవుతున్నాయి. పొలాల్లోనే దమ్ము చక్రాలను వదిలి వస్తే కొంత వరకు రోడ్డు దెబ్బతిన కుండా ఉండే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు. ఇనుప చక్రాల మధ్య రబ్బరు తొడుగులు చుట్టి రోడ్లపై తిప్పితే రోడ్డు దెబ్బతినవని పలువురు అంటుండగా రైతులు అవేమీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు. లక్షలు ఖర్చు చేసి వేస్తున్న రోడ్లు కొంత కాలం పదిలంగా ఉండాలంటే దమ్ము ట్రాక్టర్లకు రబ్బరు తొడుగు ఉండేలా చర్యలు చేపట్టాలి. రైతులకు తక్కువ ఖర్చుతో రబ్బరు తొడుగులు అందజేసి వారికి అవగాహన కల్పించాలి.


రీ-సర్వే సమస్యలను పరిష్కరిస్తాం

తహసీల్దార్ సింగారావు

పంగులూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో గతంలో జరిగిన రీ-సర్వే వల్ల తలెత్తిన భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. మండలంలోని చందలూరు గ్రామంలో శనివారం రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో భూములు సబ్ డివిజన్ చేయాలని, విస్తీర్ణంలో వ్యత్యాసాలను సవరించాలని, మ్యూటేషన్ చేయాలని కోరుతూ రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. చందలూరులో జరిగిన సభలో మొత్తం 181 దరఖాస్తులు అందాయన్నారు. విస్తీర్ణం సవరణ కోరుతూ 74, సబ్ డివిజన్‌కు 18, మ్యూటేషన్‌కు 44, కొరిలేషన్ మార్పునకు 7, పేరు, ఫొటో మార్పునకు 36, క్లాసిఫికేషన్ మార్పు కోరుతూ రెండు దరఖాస్తులు అందచేశారని సింగారావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిష్టారావు, రీసర్వే డీటీ అర్జున్, మండల సర్వేయర్ సురేష్, వీఆర్వో పరుసురామిరెడ్డి, గ్రామ సర్వేయర్ నాగార్జున, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మార్టూరు : గ్రామ సభలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి అన్నారు. శనివారం జొన్నతాళిలో రెవెన్యూ అధికారులు గ్రామ సభను నిర్వహించారు. వైసీపీ పాలనలో జరిగిన రీసర్వేతో భూముల విస్తీర్ణం, పాస్‌బుక్ పేర్లలో పొరపాట్లు ఏర్పడ్డాయని 75 మంది రైతులు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగేంద్రమ్మ, మండల సర్వేయర్ ఏడుకొండలు, వీఆర్వో పాల్గొన్నారు.

గోశాలకు దాణా అందజేత



గోశాలకు దాణా అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకిటౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం, పవిత్ర కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా రోటరీ మిత్రుల సాయంతో అద్దంకిలోని హరిహర గోశాలకు దాణాను అందజేశారు. మూడు బస్తాల తవుడు, దాణా, పండ్లు అందజేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. గోశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సీహెచ్ మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఆంజనేయులు, నాగయ్య, సుబ్రహ్మణ్యం, గోశాల నిర్వాహకుడు సుబ్బారావు పాల్గొన్నారు.